ప్రజాశక్తి
శుక్రవారం 7 మార్చి 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

కేటాయింపుల్లో కోత

రైవాడ జలాశయం (ఫైల్ ఫొటో)

- వెనుకబడ్డ ఉత్తరాంధ్రపై అదే నిర్లక్ష్యం
- ప్రతిపాదనలను పక్కనపెట్టిన ప్రభుత్వం
- నీటి ప్రాజెక్టుల పూర్తి అనుమానమే

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం, విజయ నగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని భారీ, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వం 2025-26 బడ్జెట్‌లో సరైన కేటాయింపులు చేయలేదు. ఉత్తరాంధ్రపై సవతితల్లి ప్రేమనే చూపింది. ప్రాజెక్టుల భూ సేకరణ, పరిహారం చెల్లింపు, నిర్మాణ పనులకు అవసరమైన నిధులకు ఈ ప్రాంతం నోచుకోలేకపోయింది. ఉత్తరాంధ్ర నీటిపారుదల ప్రాజెక్టుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు తయారు చేసి పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం పట్టించుకోలేదు. నదుల అనుసంధానం, ఆయకట్టు స్థిరీకరణ, ప్రాజెక్టుల నిర్వహణ వంటి పనులు ప్రభుత్వానికి గుర్తున్నట్లులేవు. మధ్యతరహా ప్రాజెక్టులు ఆంద్ర, ఒట్టిగెడ్డ, పెదంకలాం, తాటిపూడి, డెంకాడ, పెద్దగెడ్డకు ఈ బడ్జెట్‌లో పైసా కూడా కేటాయించలేదు. కనీసం కాలువ మరమ్మతులు, నిర్వహణ పనులకు నోచుకోని పరిస్థితి ఆ ప్రాజెక్టులకు ఏర్పడింది. నిర్వహణ పనులు చేపట్టకపోతే ఖరీఫ్‌లో ఆయకట్టుకు నీటి సరఫరాలో అనేక ఆటంకాలు ఏర్పడనున్నాయి.

వంశధార, నేరేడి బ్యారేజి, తోటపల్లి ప్రాజెక్టులకు రూ.311.71 కోట్లు అవసరమని నీటిపారుదల శాఖాధికారులు పంపిన ప్రతిపాదనకు ప్రభుత్వం జల్లెడపట్టి రూ.235.33 కోట్లు మాత్రమే కేటాయించింది. మధ్య తరహా ప్రాజెక్టుల పరిధిలోని జంఝావతి, వెంగళరాయసాగర్, మడ్డువలస, రైవాడ, కోనాం, పెద్దేరు, తారకరామతీర్థసాగర్, మహేంద్రతనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టులకు రూ.431.34 కోట్లకు పంపిన ప్రతిపాదనలకు రూ.166.57 కోట్లు మాత్రమే కేటాయించింది. భారీ, మధ్య తరహా ప్రాజెక్టులకు మొత్తం రూ.743.05 కోట్లు ప్రతిపాదనలకు ప్రభుత్వం రూ.401.90 కోట్లునే కేటాయించింది. నేరేడి బ్యారేజి పనుల నిమిత్తం భూసేకరణ, పునరావాసం, పనులకు చేసిన ప్రతిపాదనలకు మిగతా 2లో..

మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు, వేదికపై నిర్మలా సీతారామన్, వెంకయ్యనాయుడు, దగ్గుబాటి

ప్రపంచ చరిత్రకు పుస్తకరూపం

- దగ్గుబాటి పుస్తకావిష్కరణలో సిఎం చంద్రబాబు
- గీతం వేదికగా ఒకేచోట నలుగురు రాజకీయ దిగ్గజాలు
- హాస్యం, వ్యంగ్యం, చమత్కారాలు, వాగ్బాణాలతో సాగిన కార్యక్రమం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కొన్ని వేల సంవత్సరాల మానవ పరిణామ క్రమాన్ని, ప్రపంచ చరిత్రను పుస్తక రూపంలో.. అది కూడా తెలుగులో రచించడం అద్భుత ప్రయత్నమని, ఆ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు ఉద్ఘాటించారు. నగరంలోని రుషికొండలోగల గీతం యూనివర్శిటీలో గురువారం ఉదయం మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు రచించిన 'ప్రపంచ చరిత్ర' (ఆదిమ కాలం నుండి నేటి వరకూ - ఆ తర్వాత) పుస్తకాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, బిజెపి ఎంపీ పురంధరేశ్వరి, విశాఖ టిడిపి ఎంపీ శ్రీభరత్ తదితరులతో కలిసి ఆవిష్కరించిన అనంతరం చంద్రబాబు ప్రసంగించారు. 'మా కుటుంబం నుంచి ఒక మంచి రచయిత ఉన్నాడని నేనింతవరకూ అనుకోలేదు' అని చంద్రబాబు నవ్వుతూ అన్నారు. 'రచయిత మిగతా 2లో..

ఉక్కు నేత అయోధ్యరామ్‌కు షోకాజ్ నోటీసు

వార్త మెయిన్‌లో..

ఆశా కార్యకర్తల గృహ నిర్బంధం

వార్త 5లో..

ప్రజా చైతన్యయాత్రలను జయప్రదం చేయండి

వార్త 6లో..

కెజిహెచ్‌లో తాగునీటి ఇబ్బంది రానివ్వం

ఆసుపత్రి గదులను పరిశీలిస్తున్న రమణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా సేవలందిస్తున్న కింగ్ జార్జ్ ఆసుపత్రికిలో రోగులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్టు కెజిహెచ్ అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టర్ బివి.రమణ తెలిపారు. రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలతో పాటు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలూ కల్పించేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, ధోబీ వార్డుతో పాటు ట్రామా యూనిట్, పలు విభాగాలను ఆయన సందర్శించారు. వార్డుల్లోని రోగులకు, వారి సహాయకులకు అందుతున్న సేవలతోపాటు ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణలో ఎక్కడా అపారిశుధ్య వాతావరణం లేకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. ఓపీ, క్యాజువాలిటీ విభాగంతో పాటు ఇతర చోట్ల ఉన్న రోగులకు వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటికి ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించాలన్నారు. ఇతర అవసరానికి అవసరమైన నీటిని కూడా అందించేందుకు చర్యలు తీసుకోవాలని విభాగాల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆసుపత్రి చీఫ్ డైటీషియన్ రమణమూర్తితో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సమానత్వంతోనే సమాజాభివృద్ధి

మహిళా దినోత్సవ ర్యాలీల్లో వక్తలు

సమానత్వంతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని, మహిళలకు అవకాశాలిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందని పలువురు వక్తలు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ జిల్లాలో గురువారం పలుచోట్ల ప్రజా సంఘాల ఆధ్వర్యాన ర్యాలీలు, సభలు జరిగాయి. అవి స్ఫూర్తివంతంగా సాగాయి (వార్తలు 4లో..)

మొదటి పేజీ తరువాయి..

కేటాయింపుల్లో కోత

మాత్రం పూర్తిస్థాయిలో రూ.182.52 కోట్ల నిధులు కేటాయించింది.

ప్రాజెక్టుల వారీ ప్రతిపాదనలు, కేటాయింపుల వివరాలు (రూ.కోట్లలో)

ప్రాజెక్టు	ప్రతిపాదన	కేటాయింపు
వంశధార ప్రాజెక్టు స్టేజ్-1	12.35	5.00
నేరేడి బ్యారేజి	182.52	182.52
తోటపల్లి బ్యారేజి	116.82	47.80
రైవాడ	2.92	0.75
కోనాం	1.62	0.10
జంఝావతి	2.68	0.10
వెంగళరాయసాగర్	4.94	4.46
మడ్డువలస	14.50	0.66
పెద్దేరు	25.00	2.00
తారకరామతీర్థ సాగర్	211.99	68.00
మహేంద్రతనయ ఆఫ్‌షోర్	167.68	90.60

ప్రపంచ చరిత్రకు పుస్తకరూపం

కాని రచయిత నా తోడల్లుడు' అని కొనియాడారు. యుద్ధాలు, సామ్రాజ్యాల ఆవిర్భావం, మత పెద్దల పెత్తనాలు, ఖండాల విభజన, బానిస వ్యవస్థ, ఆదిమ కాలం, అభివృద్ధి ఇలా ఏ విషయాన్నీ వదలిపెట్టకుండా ఈ పుస్తకంలో వెంకటేశ్వరరావు పొందుపరచడం గర్వకారణంగా ఉందన్నారు. భాష, వాస్తు, కళలు, శిల్పం, భూ సంస్కరణలు, సామాజిక న్యాయం, భూస్వామ్య వ్యవస్థ, రాజులతో పాటు ఎపిలో ప్రజాపాలన గురించి, అచ్చుయంత్రం, సాంకేతిక విప్లవం, భవిష్యత్‌లో ఏం జరుగబోతుందో ముందే ఊహించి దీంట్లో రాయగలగడం గొప్ప విషయమన్నారు. మా కుటుంబం నుంచి ఇంత నైపుణ్యంతో అధ్యయనం చేసి సమాజానికి మంచి పుస్తకాన్ని అందించిన నా తోడల్లుడు విశిష్టమైన వ్యక్తి అని కొనియాడారు.

బాబు, దగ్గుబాటి ఆలింగనం

హాస్యం...వ్యంగ్యం..చమత్కారాలు..

సభికులంతా నవ్వుల్లో మునిగితేలే విధంగా వేదికపై ఆశీనులైన దిగ్గజ రాజకీయ నాయకులంతా ప్రసంగాల్లో హాస్యం కురిపించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ముఖ్య అతిథిగా ఈ పుస్తకావిష్కరణకు హాజరయ్యారు. గౌరవ అతిథులుగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎంపీ పురంధరేశ్వరి, పుస్తక రచయిత దగ్గుబాటి వెంకటేశ్వరరావు విచ్చేశారు. 'పాత వైరాలు.. పరస్పర వ్యవహారాలపైనా హాస్యంగా వ్యంగ్యాస్త్రాలు గుప్పించుకున్నారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాను 30 ఏళ్ల తర్వాత వేదికపైకొచ్చి మాట్లాడుతున్నానని, రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నానని అన్నారు. తాను సైన్స్ స్టూడెంట్‌నైనా చరిత్ర చదివేందుకు శ్రమించానని తెలిపారు. తనకు చంద్రబాబుకు మధ్య వైరం ఉంది అంటారని, ఉన్నమాట వాస్తవమేనని అనగానే సభికుల నుంచి నవ్వులు విరిశాయి. జీవితంలో గందరగోళం అక్కర్లేదని, జీవితాన్ని ఆనందంగా ఆస్వాదించాలని అన్నారు. గతం మరచిపో భవిష్యత్‌వైపు సాగిపో అన్నదే నిజమన్నారు. తాను పలు దేశాలు తిరిగాక శాస్త్రవేత్తలు గొప్ప విషయం ఒకటి తెలిపారని ఆయన చెబుతూ... వచ్చే ఐదేళ్లలో గొప్ప ఆవిష్కరణ జరగబోతుందని, అది సక్సెస్ అయితే ఇప్పుడు వయసులో ఉన్నవారు కూడా ఆ తర్వాత 50 ఏళ్ల వరకూ జీవించే టెక్నాలజీ అందుబాటులోకి రానుందని దగ్గుబాటి చెబుతూ 'చంద్రబాబు దీని గురించి ఎక్కువ నువ్వు ఆలోచించొద్దని.. లోకేష్‌కు కోపం వస్తుందని అంటూ వ్యంగ్య వ్యాఖ్యానం చేశారు. దీంతో సభ ఒక్కసారిగా గొల్లుమని నవ్వులు వినిపించాయి. చంద్రబాబు మాట్లాడుతూ నా తోడల్లుడు సంతోషంగా ఎలా ఉండగలుగుతున్నాడని ఆయన్నే అడిగానని, ఆయన అలవాట్లు చెబుతూ 'మధ్యాహ్నం పూట పేకాట' ఆడ్డానికి కూడా వెళ్తాడని చెప్పాడని అనగానే సభలో నవ్వులు విరిశాయి. ఐదేళ్ల తర్వాత 50 ఏళ్లు జీవించే ఆవిష్కరణ వస్తే అంతకే ఎవ్వరూ పరిమితం కారని, శాశ్వతంగా ఉండిపోయే ఆవిష్కరణకు ప్రయత్నిస్తారని చంద్రబాబు అనడంతో అందరూ చప్పట్ల వర్షం కురిపించారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ 'చంద్రబాబు మంచి పాలనాదక్షుడేనని, అయితే ఓవర్ కాన్ఫిడెన్స్‌తో వర్తమానం గురించి కాకుండా దీర్ఘకాల ప్లాన్‌లు వేయడం సరైంది కాదని, అన్నీ దృష్టిలో పెట్టుకుని రాష్ట్రం గురించి ఆలోచించాలని పరోక్షంగా చురకలు అంటించారు. తాను ఏ విషయమైనా సూటిగా చెబుతానని తనకు పదవీ విరమణేగానీ 'పెదవీ' విరమణ లేదనడంతో సభలో ఒక్కసారి నవ్వులు, చప్పట్లు కురిశాయి. దీనిపై చంద్రబాబు మాట్లాడుతూ నా బాధంతా తెలుగు జాతికోసమేతప్ప మరొకటి కాదన్నారు. వెంకయ్యనాయుడు 'పంచ్'ల్లో పవర్ 1971లో ఎలాగుందో ఇప్పుడూ అలాగే ఉందని, మరో మాటలో చెప్పాలంటే పెరిగిందేగానీ తగ్గలేదని చంద్రబాబు అన్నారు.

సిఎంకు ఎయిర్‌పోర్టులో ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. గురువారం ఉదయం విశాఖలోని గీతం యూనివర్సిటీలో జరిగిన ఓ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన మధ్యాహ్నం విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి తిరుగు పయనమయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ, ఆర్‌డిఓ పి.శ్రీలేఖ, డిసిపి మేరీ ప్రశాంతి ముఖ్యమంత్రికి ఆత్మీయ వీడ్కోలు పలికారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రత్యేక విమానం ద్వారా ఢిల్లీ పయనమయ్యారు.

గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కల్లు గీత కార్మికులకు విశాఖ జిల్లాలో కేటాయించిన 14 మద్యం షాపులకు సంబంధించిన వేలంపాట గురువారం సాయంత్రం సిరిపురంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనా మొదటి అంతస్తులో జరిగింది. జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ మాన్యువల్ పద్ధతిలో డ్రా నిర్వహించి షాపులను కేటాయించారు. 14 షాపులకు సంబంధించి మొత్తం 316 దరఖాస్తుల ద్వారా ఇప్పటికే ప్రభుత్వానికి రూ.6.32 కోట్ల ఆదాయం లభించగా ఈ రోజు నిర్వహించిన డ్రాలో షాప్‌లు దక్కించుకున్న వారు చెల్లించిన ముందస్తు లైసెన్సు ఫీజుతో మరో రూ.94.16 లక్షలు ఆదాయం చేకూరింది. మొత్తం 14 షాపుల్లో రూరల్ ప్రాంతాల్లో ఆనందపురం, భీమిలి, పద్మనాభంలలో ఒక్కొక్క షాపు, జివిఎంసి పరిధిలో 11 షాపులకు వేలం నిర్వహించారు. ఈ డ్రాలో విశాఖపట్నం జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి ప్రసాద్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ వేలం పాట ఫిబ్రవరి 11న జరగాల్సి ఉండగా ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడుతూ వచ్చిన విషయం తెలిసిందే.

డ్రా తీస్తున్న జెసి మయూర్ అశోక్

8న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని అన్ని న్యాయ స్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో జిల్లాలోని న్యాయ స్థానాలలో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్టపరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ చట్టం కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, జిల్లా కోర్టు ప్రాంగణం, విశాఖపట్నం, ఫోన్ : 0891 - 2560414, 2575046ను సంప్రదించాలని కోరారు.

మహిళా రక్షణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అధికారంలో ఉన్న ప్రభుత్వాలు స్త్రీ, పురుష సమానవత్వాన్ని సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని, మహిళల రక్షణకు ప్రాధాన్యతనివ్వాలని మహిళా చేతన కార్యదర్శి కె.పద్మ విజ్ఞప్తి చేశారు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహిళా చేతన ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఏ మూలన చూసినా మహిళలపై అత్యాచారాలు, అవమానాలు, లైంగిక దాడులు పెరుగుతూనే ఉన్నాయన్నారు. సామాజిక అసమానతలు, దౌర్జన్యం, హింస రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. దళిత మైనారిటీ స్త్రీల రాజ్యాంగబద్ధ హక్కులను కాపాడాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌ఎఫ్‌కు చెందిన కె.అనురాధ, ప్రగతిశీల కార్మిక సమాఖ్య ప్రతినిధి అన్నపూర్ణ, జమాతే ఇస్లాం మహిళా సంస్థ నుంచి షంషాద్ బేగం, క్రిస్టియన్ మైనారిటీస్ నుంచి లావణ్య పాల్గొన్నారు.

విభాగాధిపతులతో విఎంఆర్‌డిఎ ఛైర్మన్ సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ గురువారం ఉదయం విఎంఆర్‌డిఎ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో విఎంఆర్‌డిఎ విభాగాధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సంస్థ చేపడుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకుని క్షేత్ర స్థాయిలో పనులను వేగవంతం చేయాలని, స్థానిక శాసనసభ్యుల సహకారం తీసుకోవాలని సూచించారు. పూర్తయిన పనులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.

నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భర్తీ చేస్తున్న నామినేటెడ్ పదవులలో ఉత్తరాంధ్రకు చెందిన శిష్టకరణాలకు ప్రాధాన్యతనివ్వాలని ఆంధ్రప్రదేశ్ శిష్టకరణాల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు, బెలగాం జయబాబు కోరారు. గురువారం దసపల్లా హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గానికి తాము ఎటువంటి ఎన్నికా నిర్వహించలేదని, ఇటీవల కొంతమంది తమ పేరును ఉపయోగించి ఇతర ప్రాంతాల నుంచి వచ్చి తాము రాష్ట్ర నాయకులమని గుర్తింపు పొందే ప్రయత్నం చేశారని తెలిపారు. శిష్టకరణాలు ఆర్థిక, సామాజిక, రాజకీయ వెనుకబాటుతనంతో ఉన్నారని తెలిపారు. వారికి తక్షణం కార్పొరేషన్ కేటాయించి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ 30 మందితో ఎన్నికయి రాష్ట్ర అధ్యక్షునిగా పేరు పెట్టుకున్న నేతలకు ప్రభుత్వాలు ఎట్టి పరిస్థితుల్లో అవకాశం ఇవ్వకూడదన్నారు.

నేడు పిఎన్‌బి వన్ టైమ్ సెటిల్‌మెంట్ క్యాంపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పంజాబ్ నేషనల్ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్‌పిఎ ఖాతాదారుల రుణ విముక్తి కోసం బ్యాంకు అన్ని శాఖలలో వన్ టైమ్ సెటిల్‌మెంట్ క్యాంపు నిర్వహిస్తున్నామని బ్యాంకు అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో ఎన్‌పిఎ ఖాతాదారుల పెండింగ్ లోన్లు రాయితీతో సెటిల్ చేసుకుని ఆర్థిక స్థిరత్వాన్ని పొందేందుకు, చట్టపరమైన చర్యల నుండి విముక్తి పొందేందుకు సహకారం లభిస్తుందని, క్యాంపులో బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొంటారని వెల్లడించారు. అప్పటికప్పుడే ఒటిఎస్‌పై నిర్ణయాన్ని తెలియజేస్తారన్నారు. తద్వారా ఆర్థికపరమైన ఇబ్బందులతో ఉన్న ఎన్‌పిఎ ఖాతాదారులందరూ రాయితీతో సెటిల్‌మెంట్ చేసుకుని రుణ విముక్తి పొందే అవకాశం ఉందన్నారు. ఆసక్తి ఉన్న ఖాతాదారులందరూ వారికి దగ్గరలో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ శాఖకు వెళ్లాలని సూచించారు.

ఎంవిపి రైతు బజార్‌లో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సాధారణ తనిఖీల్లో భాగంగా తూనికలు, కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ రామారావు గురువారం ఉదయం ఎంవిపి.కాలనీ రైతుబజార్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రైతులు, డ్వాక్రా గ్రూపులు, ఇతర వాణిజ్య సంబంధ స్టాల్స్ తాలూకా కాటాలు, స్టాంపింగ్ చెకింగ్ చేశారు. ఆయన వెంట తూనికలు, కొలతలు శాఖ సిబ్బంది ప్రసాద్, రమణ, రైతుబజార్ ఎస్టేట్ అధికారి కె.వరహాలు, సహాయకులు కనకరాజు ఉన్నారు.

KVB **ది కరూర్ వైశ్య బ్యాంకు లిమిటెడ్**
శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం దగ్గర వర్తక సంఘం బిల్డింగ్, కాయగూరలు మార్కెట్, అనకాపల్లి

బంగారు నగల వేలం ప్రకటన

దిగువ తెలిపిన నగలను బ్యాంకు వారు బహిరంగ వేలం ద్వారా వేలం వేయు నిర్ణయించినారు. కావున తెలియజేయడమైనది.
వేలం జరుగు స్థలం : ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్ అనకాపల్లి శాఖ, శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం దగ్గర వర్తక సంఘం బిల్డింగ్, కాయగూరలు మార్కెట్, అనకాపల్లి.
వేలం జరుగు తేది మరియు సమయం : తేది. 25-03-2025, మంగళవారం, సాయంత్రం గం.4 గం॥లకు.

వ.నెం.	ఖాతా నెం.	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	బరువు గ్రా.లలో
1	1420950000005063	అయితా రమేష్, తండ్రి అప్పారావు	23.2

షరతులు నిబంధనలు : 1) పైన తెలిపిన ఋణగ్రహీతలక గతంలో జారీ చేసిన నోటీసులు (అవి ఏ కారణము చేతనైనను తిరిగి వచ్చిననూ) దీనినే అఖరి నోటీసుగా భావించవలసినది. 2) ఒకవేళ ఋణగ్రహీత మరణించినచో వారి వారసులకు కూడా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. 3) ధరావత్తు రూ.10,000/- (ఋణగ్రహీత ఋణం రూ.1,06,500/-ను) బ్యాంకు వారు వేలం తేది 25-03-2025 మధ్యాహ్నం 2.00 గం॥ల వరకు మాత్రమే స్వీకరించబడును. 4) విజయవంతమైన పాటదారుడు వేలం తేది25-03-2025 సాయంత్రం 4.00 గం॥ల లోపు ధరావత్తు మినహా మిగిలిన పాట మొత్తమును చెల్లించి నగలను స్వంత బాధ్యత వహించి పొందవలెను. 5) నగల నాణ్యతను పాటకు ముందుగానే పాటదారుడు సరి చేసుకోవలెను. అందుకు బ్యాంక్ బాధ్యత వహించజాలదు. 6) ఏ విధమైన ముందుస్తు ప్రకటన లేకుండగానే వేలంను పాక్షికముగా గాని పూర్తిగా గాని రద్దు చేయు అధికారము బ్యాంక్‌కు కలదు. 7) పాటదారుడు సరైన ఫోటో,పాన్‌కార్డు మరియు చిరునామా రుజువులను ప్రాథమికముగా చేయుట తప్పనిసరి 8) రిజర్వు ధర ధరావత్తు మరియు ఇతర పూర్తి నియమ నిబంధనల కొరకు అనకాపల్లి శాఖ నందు సంప్రదించగలరు.

తేది: 06-03-2025, అనకాపల్లి, సం/- బ్రాంచిమేనేజర్

బిఆర్‌టిఎస్‌లో ఆక్రమణలు

- కనుమరుగవుతున్న గ్రీన్‌బెల్ట్
- ఫుట్‌పాత్‌లను కూడా వదలని ఆక్రమణదారులు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తోన్న టౌన్‌ప్లానింగ్
- ఇబ్బందులు పడుతున్న బాటసారులు

ఫుట్ పాత్ లను ఆక్రమించి వ్యాపారాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : హనుమంతువాక నుంచి అడవివరం వైపు వెళ్లే బిఆర్‌టిఎస్ రహదారికి చెందిన స్థలాలు అడుగడుగునా ఆక్రమణలకు గురవుతున్నాయి. పచ్చదనం కోసమో, రహదారి విస్తరణ కోసం ఉంచిన స్థలాలతో పాటు ఫుట్ పాత్‌లు ఆక్రమణదారుల పరం అవుతున్నాయి. రహదారికి ఆనుకొని దర్జాగా కబ్జా చేస్తున్నా, ఫుట్‌పాత్‌లను సైతం ఆక్రమించుకొని వ్యాపారాలు సాగిస్తున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం ఏమీ పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. హనుమంతువాక నుంచి అడివివరం వరకు నిర్మించిన బిఆర్‌టిస్ రోడ్డుకు ఇరువైపులా అందమైన ఫుట్‌పాత్‌లు నిర్మించారు. ఫుట్‌పాత్ నుంచి సుమారు 20 అడుగులకు పైగా ఖాళీ స్థలాన్ని విడిచి పెట్టారు. భవిష్యత్తు అవసరాలు, పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఈ స్థలాన్ని విడిచి పెట్టారు. బిఆర్‌టిఎస్ రహదారి కోసం స్థలాలు కోల్పోయిన వారికి అప్పట్లో పరిహారం ఇచ్చేశారు. కాని పచ్చదనం కోసం ఉంచిన స్థలాలను కొంతమంది ఆక్రమించుకొని అనధికార నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు సాగిస్తున్నారు. పైనాపిల్‌కాలనీ, దారపాలెం ప్రాంతాల్లో బిఆర్‌టిఎస్‌కు ఆనుకొని ఉన్న స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. కొద్దిరోజుల క్రితం నుంచి వరుణ్ మోటార్స్ సంస్థ నిర్వాహకులు దారపాలెం వద్ద ఫుట్ పాత్‌ను ఆనుకొని బోర్ తవ్వించి దర్జాగా పెద్ద షెడ్డు నిర్మాణం చేపడుతోంది. దీనికి సమీపంలోనే మరికొన్ని షెడ్డులు నిర్మించేశారు. దీంతో బిఆర్‌టిఎస్ రోడ్డుకు చెందిన ఖాళీ స్థలాలు కనిపించకుండా పోతున్నాయి. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పట్టించుకోకపోవడం అనేక విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా జివిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి ఆక్రమణలకు గురైన స్థలాలను రక్షించుకోవాలని, ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

దారపాలెంలో బిఆర్‌టిఎస్ ఫుట్‌పాత్‌ను ఆనుకొని నిర్మాణం

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన హనుమంతువాక కూడలిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసకుంది. సుజాతనగర్‌కు చెందిన కోటేశ్వరరావు బుధవారం అర్ధరాత్రి నగరం నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. నగరంలోని చావుల మదుము వద్ద గుర్తు తెలియని వ్యక్తి కోటేశ్వరరావును లిఫ్ట్ అడిగాడు. ఇరువురు బైక్‌పై హనుమంతువాక వైపు వస్తున్నారు. హనుమంతువాక కూడలి వద్ద తిరిగి నగరం వైపు వెళ్లేందుకు మలుపు తిరుగుతున్నారు. అదే సమయంలో మధురవాడ నుంచి నగరంలోకి వస్తున్న లారీ కోటేశ్వరరావు వాహనాన్ని ఢీకొట్టింది. దీనితో వెనుక కూర్చున్న గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడిపిన కోటేశ్వరరావుకు కాలు విరిగి పోయింది. కోటేశ్వరరావు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. గాయాలైన కోటేశ్వరరావు సుజాతనగర్‌లో ఒక అపార్టుమెంట్‌లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆరిలోవ : మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆరిలోవ ఎస్ఐ కృష్ణ కథనం ప్రకారం... ఆరిలోవ దుర్గాబజార్‌కు చెందిన టి.మణికంఠకు పదోతరగతి చదువుతున్న కుమార్తె ఉంది. ఫోన్ విషయమై తండ్రి, కూతురు మధ్య వివాదం జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన తండ్రి మణికంఠ ఫిబ్రవరి 24న పురుగుల మందు తాగాడు. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మణికంఠ పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు.

ఘనంగా అనంతుని పెళ్లిరాట

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పద్మనాభం గ్రామంలో ఉన్న అనంతపద్మనాభ స్వామి పెళ్లిరాట కార్యక్రమం గురువారం ఈవో నానాజీ బాబు ఆధ్వర్యాన కొండ దిగువన ఉన్న కుంతీ మాధవ స్వామి ఆలయం గాలిగోపురం వద్ద ఘనంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు సీతారామ ఆంజనేయులు బృందం మంత్రోత్సవం మధ్య ఏర్పాటుచేసిన కార్యక్రమంలో స్థానిక మహిళలు 60 మంది పాల్గొన్నారు.

8 నుంచి పి4 సర్వే

ప్రజాశక్తి -ఆనందపురం : విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆనందపురం ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి గ్రామ సచివాలయ ఉద్యోగులకు పి4 సర్వేపై వర్చువల్ శిక్షణ ఇచ్చారు. ఈ నెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా సర్వే జరుగుతుందని ఎంపిడిఒ తెలిపారు. పేదరికం లేని సమాజ నిర్మాణం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పి4) సర్వేకు రూపకల్పన చేసిందని వివరించారు. ఈ సర్వే ద్వారా పేదల అవసరాలను గుర్తించి వారి సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల రూపకల్పనకు వీలవుతుందని పేర్కొన్నారు. కుటుంబాలు ప్రస్తుతం అందుకుంటున్న పథకాలపై ఈ సర్వే ఎలాంటి ప్రభావం చూపదని స్పష్టం చేశారు. సర్వే ద్వారా సేకరించిన డేటా ఆధారంగా ఇంటి అవసరాలకు అనుగుణంగా సమర్ధవంతమైన ప్రణాళికల రూపకల్పనకు వీలవుతుందన్నారు. ఈ సమాచారాన్ని వివరించి కుటుంబ వివరాలతో పాటు వివిధ సామాజిక, ఆర్థిక పరిమితుల ఖచ్చితమైన సమాచారాన్ని యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కుటుంబాలకు ఏవైనా ఆపోహలు ఉంటే తొలగించి, సర్వేను పది రోజుల్లో పూర్తిచేయాల్సి ఉంటుందన్నారు. అన్ని సమన్వయ శాఖల సమిష్టి భాగస్వామ్యంతో సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయి అధికారులు కృషి చేయాలని ఆమె కోరారు.

తలసేమియాతో బాలునికి తీవ్ర అస్వస్థత

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం బీసీ కాలనీకి చెందిన బాలుడు బోరాడి శ్రావణ్ (7) తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. తండ్రి పాపారాయుడు వంట మాస్టర్‌గా పని చేస్తూ కుటుంబ పోషణ సాగిస్తున్నారు. బాలుడి తల్లి తవిటమ్మ గృహిణిగా ఉంటుంది. ఎంతో చలాకీగా ఉండే పిల్లవాడిలో 2022లో అకస్మాత్తుగా రక్తం తగ్గిపోయింది. నాలుగు గ్రాములకు పడిపోయింది. ఆ సమయంలో జ్వరం, నీరసం వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మరలా 2024 అక్టోబర్‌లోను, 2025 జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఇదే పరిస్థితి ఎదురైందని, వైద్యానికి ఎక్కువ డబ్బులు ఖర్చు అవుతున్నాయని కుటుంబీకులు చెప్పారు. బోన్‌మ్యారో చేయాలని, రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని, పేదలమైన తమకు ప్రభుత్వం చేయూతనిచ్చి ఆదుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. దరఖాస్తు చేసి మూడేళ్లయినా పిల్లవాడికి ఫించన్ రావడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి వైద్యానికి సహాయం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. దాతలు కూడా సాయం చేయాలని అభ్యర్థిస్తున్నారు. సాయం చేయదలచిన దాతలు 7036327442, 809653743 నెంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తిచేశారు.

సాయం కోసం ఎదురుచూపు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

బెయిల్‌పై జెవిఎస్ఎన్ విడుదల

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎల్‌జి పాలిమర్స్ కేసులో గత శుక్రవారం అరెస్టయిన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి గురువారం కేంద్రకారాగారం నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. కేంద్రకారాగారం వద్దకు చేరుకున్న సిపిఐ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, రీకాల్ చేసుకోలేదన్న నెపంతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న వారిని అరెస్టు చేసి రిమాండుకు పంపించడం సరికాదన్నారు. ఇది కేవలం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటమేనని పేర్కొన్నారు. రీకాల్ చేసుకోవడానికి కోర్టుకు వెళ్లిన రోజు న్యాయమూర్తి జువనైల్ కోర్టుకు వెళ్లారని, తిరిగి శుక్రవారం రీకాల్ చేసుకుంటానని చెప్పినా గోపాలపట్నం పోలీసులు వినకుండా విచక్షణారహితంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను బెయిల్‌పై విడుదలయ్యేందుకు కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ, ఇసుక, లిక్కర్ మాఫియా, భూకబ్జాలకు పాల్పడిన వారు విచ్చలవిడిగా బయట తిరుగుతుంటే, ప్రజాసమస్యలపై పోరాడిన వారిని అరెస్టులు చేయడం బాధకారమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు ఎ.విమల, కె.సత్యనారాయణ, ఆర్.శ్రీనివాసరావు, ఎస్‌కె.రెహ్మాన్, పి.చంద్రశేఖర్, జి.రాంబాబు, క్షేత్రపాల్, యు.నాగరాజు, వై.రాంబాబు, ఎ.అప్పన్న, ఎమ్‌డి బేగం, కె.వనజాక్షి, ఎ.దేవుడమ్మ, అన్నపూర్ణ, డి.మార్కెండేయులు పాల్గొన్నారు.

గీతంలో ముగిసిన కెరీర్ ఫెయిర్

ప్రజాశక్తి -మధురవాడ : ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థలతో కలిసి నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహిస్తున్న కెరీర్ ఫెయిర్ గురువారం ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ కెరీర్ ఫెయిర్‌లో దాదాపు 50 కంపెనీలు నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలను నిర్వహించాయి. 33 వేల మంది కెరీర్ ఫెయిర్‌లో పాల్గొనడానికి పేర్లను నమోదు చేసుకోగా ఒక్క ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే 20 వేల మందికిపైగా యువతీయువకులు హజరయ్యారు. మొదటి రోజు పెద్ద సంఖ్యలో యువత రావడంతో రాత్రి 8గంటల వరకు ఇంటర్వ్యూలు కొనసాగాయి. ఫలితాలను ఆయా కంపెనీలు విద్యార్థులకు వ్యక్తిగతంగా మెయిల్ ద్వారా సమాచారం పంపనున్నాయి. కొన్ని కంపెనీలు ఎంపికైన విద్యార్థులకు రెండవ రోజు జరిగిన కార్యక్రమంలో 600 మందికి నియామక పత్రాలను అందజేశాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నాస్కామ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఉప్‌మిత్ సింగ్ మాట్లాడుతూ, దేశంలోని ద్వితీయ శ్రేణి పట్టణాలలో నైపుణ్యంగల యువతకు అవకాశాలు లభించే విధంగా నాస్కామ్ కృషి చేస్తోందని తెలిపారు. దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో పాటు 13 రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నామని వెల్లడించారు. విద్యార్థులలో డిజిటల్ నైపుణ్యాలు పెంచడానికి నిర్ధేశించిన ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ కార్యక్రమంలో భాగంగా 400 కోర్సులను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు నిరంతరం సాంకేతిక మార్పులపై అవగాహన పెంచుకుని నైపుణ్య శిక్షణ పొందాలని పిలుపునిచ్చారు. కాగా కెరీర్ ఫెయిర్‌లో భాగంగా ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ కార్యక్రమం గీతం విశ్వవిద్యాలయంలో అమలు చేయడానికి వీలుగా నాస్కామ్‌తో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యా మండలి అధికారి ఎమ్‌వి.రాధాకృష్ణ, గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ అధిపతి ఉమాదేవి, డైరక్టర్ వంశీకృష్ణసోమయాజుల తదితరులు పాల్గొని ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

నియామక పత్రాలను అందిస్తున్న కంపెనీల ప్రతినిధులు

విద్యార్థులతో స్కూల్ యాజమాన్యం

మురళీ మాధవ విద్యాలయంలో ఫేర్‌వెల్

ప్రజాశక్తి -మాధవధార : మురళి మాధవ విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు వివిధ తరగతుల విద్యార్థులు ఫేర్‌వెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి, మహిళ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు కె.మాధవి మాట్లాడుతూ, పదవ తరగతి పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. మంచి మార్కులు సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఈ ఏడాది మురళీ మాధవ విద్యాలయంలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు తమ అసోసియేషన్ ద్వారా క్యాష్ ప్రైజ్ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం కె,మాధవిని మురళీ మాధవ విద్యాలయం కరస్పాండెంట్, ప్రిన్సిపల్ సనపల మురళీధర్, సనపల సత్యవతి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుగొంఖ మాంబ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-పెందుర్తి : మండలంలోని నరవలో ఉన్న పెనుగొంఖ మాంబ ఆలయం 14వ వార్షికోత్సవాన్ని గురువారం ఆలయ ధర్మకర్త గల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యాన నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించుకున్నారు. జనసేన నాయకులు పంచకర్ల వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు మౌర్యసింహ, నాయకులు ఇందల వెంకటరమణ, స్థానిక నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యాన భారీ అన్న సమారాధన చేపట్టారు

కృష్ణవేణికి నివాళి

ప్రజాశక్తి -గోపాలపట్నం : తెలుగు సినీ రంగంలో తొలితరం నటి, బహుముఖ ప్రజ్ఞాశాలి కీర్తిశేషులు కృష్ణవేణికి గోపాలపట్నం కళా సేవా పీఠం కార్యాలయంలో ఘన నివాళు లర్పించారు. ఆమె చిత్రపటానికి పీఠం అధ్యక్షుడు గొరపల్లి బంగార్రాజు, ప్రధాన కార్యదర్శి కొంతం నూకరాజేశ్వరరావు పూలమాలవేసి అంజలి ఘటించారు. వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు మాట్లాడుతూ, తెలుగు సినీ రంగంలో తొలి తరం హీరోయిన్‌గా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా, గాయనిగా అసాధారణ ప్రజ్ఞా పాటవాలు ప్రదర్శించిన మహానటి కృష్ణవేణి అని కొనియాడారు. ఎన్‌టి.రామారావును తాను నిర్మించిన మనదేశం చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయం చేశారని గుర్తుచేశారు. మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావును, గాయని పి.లీలను సినీ రంగానికి పరిచయం చేసిన ప్రజ్ఞాశాలి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు చందు సుబ్బారావు, గౌరవ సలహాదారులు తాండ్రంగి రామారావు, మిద్ది అప్పారావు, సహాయ కోశాధికారి వల్లూరి జగదీష్, కంపర కోటేశ్వరరావు, టి.రామచంద్రరావు, గోరింట్ల సింహాచలం, అల్లు నారాయణరావు, బాస్కర్ పాణిగ్రాహి, చింతా దుర్గా మల్లేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలతో ఉపాధి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో ఉపాధి లేని యువతీ యువకులు కార్పొరేషన్ ద్వారా రుణాలు తీసుకొని ఉపాధి అవకాశాలు పొందడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేసిందని ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్ గురువారం తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ఆదేశాల మేరకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో బిసిఎస్‌డబ్ల్యూ కాపు కార్పొరేషన్లకు చెందిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 50 శాతం ప్రభుత్వం 50 శాతం రాయితీతో బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయని తెలిపారు. ఈ రుణం పొందడానికి రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలతో 21 నుంచి 60 సంవత్సరాలు వయసున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

దబ్బంద - మధురవాడ రోడ్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -ఆనందపురం : మామిడిలోవ పంచాయతీ దబ్బంద గ్రామం నుండి మధురవాడ వైపు వెళ్లే బక్కన్నపాలెం వరకు రోడ్డు వేయుటకు ఫారెస్ట్ పర్మిషన్ ఇప్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును మామిడిలోవ గ్రామానికి చెందిన టిడిపి జిల్లా కార్యదర్శి జోగ ముత్యాలు కోరారు. ముఖ్యమంత్రి స్పందిస్తూ త్వరలో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు లెటర్ రాస్తానని హామీఇచ్చారని ముత్యాలు తెలిపారు. ఈ సమస్య పరిష్కారమైతే పెందుర్తి ఆనందపురం హైవేకు, మధురవాడ వెళ్లడానికి ప్రజలకు చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు.

సమానత్వంతోనే సమాజాభివృద్ధి

మహిళా దినోత్సవ ర్యాలీల్లో వక్తలు

పెందుర్తిలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు జగన్

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : సిఐటియు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విశాఖ నగరంలో గురువారం సాయంత్రం ప్రదర్శన నిర్వహించారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ ప్రదర్శన ఆశీలుమెట్ట, లలితా జ్యుయలర్స్, ఆర్టీసీ కాంప్లెక్స్, గురజాడ సెంటర్, సెంట్రల్ పార్క్ మీదుగా తిరిగి గాంధీ విగ్రహం వద్దకు చేరుకుంది. ప్రదర్శన అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఉపాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, ఎ.సీతామహాలక్ష్మి, అప్పలరాజు, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి.నూకరాజు, యు.రాజు మాట్లాడారు. మహిళా హక్కుల కోసం పోరాటం చేసిన ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమైన రోజు మార్చి 8 అని గుర్తుచేశారు. వ్యవసాయం నుంచి అంతరిక్షం వరకు సకల రంగాల్లోనూ స్త్రీలు సమున్నత స్థానాల్లో విశిష్ట కృషి చేస్తున్నారన్నారు. ఉత్పత్తి రంగాల్లో భాగస్వామ్యంతో పాటు సరైన అవకాశాలు ఇస్తేనే మహిళలు అభివృద్ధిని సాధిస్తారనడంలో ఎలాంటి సందేహమూ లేదన్నారు. నేటికీ చట్టసభల్లో మహిళలకు సముచిత స్థానాన్ని పాలకులు ఇవ్వడం లేదన్నారు. మనుస్మృతిని తలకెత్తుకుంటున్న మత శక్తుల రాజ్యంలో మహిళ సమానత్వ పురోగతి అగమ్యగోచరంగానే ఉందన్నారు. స్త్రీని సరుకుగా చూసే కార్పొరేట్ శక్తుల పెత్తనం మరోవైపు విజృంభిస్తోందన్నారు. మహిళల మీద రోజు రోజుకూ హింస, వేధింపులు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. మద్యాన్ని అరికట్టాల్సిన ప్రభుత్వాలు దాన్ని ఆదాయ వనరుగా చూడటం, అదనంగా మద్యం షాపులకు లైసెన్సులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. మహిళలు నేటికీ శ్రమదోపిడీకి గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బొట్టా ఈశ్వరమ్మ, ఆర్.వరలక్ష్మి, కె.మణి, వి.ప్రభావతి, లీలావతి, కె.కుమారి, ఎం.సుబ్బారావు, పి.వెంకటరావు, ఆర్‌పి యూనియన్ నాయకులు ఝాన్సీ, మల్లీశ్వరి, అంగన్వాడీ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, నూకరత్నం, కృప, శోభారాణి పాల్గొన్నారు.

మధురవాడ : కొమ్మాది కూడలి నుంచి మధురవాడ మార్కెట్, వంతెన మీదుగా జివిఎంసి జోనల్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సిఐటియు, ఐద్వా, డివైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ, అన్ని రంగాలలో మహిళలు సమానత్వం సాధించడంతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ అధ్యక్ష కార్యదర్శులు డి.కొండమ్మ, పి.రాజ్‌కుమార్, జి.మంగశ్రీ, ఎస్‌వి.శ్రీదేవి, ఐద్వా నాయకులు బి.భారతి, కె.సుజాత, డివైఎఫ్ఐ నాయకులు డి.ఉమా శైలజ, లలిత, శేషు, కె.కొండమ్మ, రామప్పడు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : గాజువాకలో ఐద్వా, సిఐటియు, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన భారీ ర్యాలీ నిర్వహించారు. వంద అడుగుల రోడ్డు నుండి బయలుదేరిన ర్యాలీ కణితి రోడ్డు మీదగా రత్నం వారి వంటిల్లు వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె.సంతోషం, సిఐటియు నాయకులు ఎం.రాంబాబు, నాయకులు జి.లక్ష్మి, గొలగాని అప్పారావు, చిన్నమ్ములు, సాయి సరస్వతి, దేవి, ఎం.శ్రీదేవి, పి.యశోద, రాణి. స్వర్ణలత, వేణు పాల్గొన్నారు.

తగరపువలసలో ర్యాలీ చేస్తున్న స్కీం వర్కర్లు

తగరపువలస : సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన స్థానికంగా స్కీం వర్కర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ జ్యూట్ కార్మిక వాడ మీదుగా జంక్షన్‌కు చేరుకుంది.అనంతరం జరిగిన సభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.మణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రవ్వ నరసింగరావు, ఆనంద్, పలు సంఘాల నాయకులు ఎం.శ్రీదేవి, కె.పద్మావతి, అప్పయ్యమ్మ, సూరమ్మ, అపర్ణ, కుంచమ్మ తదితరులు పాల్గొన్నారు

పెందుర్తి: పెందుర్తిలో ఐద్వా, సిఐటియు, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన అంబేద్కర్ విగ్రహం నుండి చినముసిడివాడ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం బహిరంగ సభ ఏర్పాటుచేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఎల్.దేవి, జి.శంకరరావు, అప్పలనాయుడు, ఎన్.నాగమణి, డి.రత్నకుమారి, పి.నాగలక్ష్మి, వరలక్ష్మి, శ్రీలక్ష్మి, ప్రభుదేవా, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో ర్యాలీ చేస్తున్న నాయకులు

మధురవాడలో ర్యాలీ చేస్తున్న నాయకులు

ఘనంగా కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి 25వ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. గురువారం హోమం, పంచామృత అభిషేకం, విద్యా ప్రాప్తి, విదేశీయానం, గ్రహ సంపత్తి, నవగ్రహ దోష, హయగ్రీవ ఇష్టిని నిర్వహించారు. కళ్యాణ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా చేశారు. అనంతరం మహా అన్నసమారాధన, గరుడసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ అపాలని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ హాస్పిటల్ వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి 157వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలనుద్దేశించి సత్యనారాయణ మాట్లాడుతూ, హాస్పిటల్ ప్రయివేటీకరణపై రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం స్పందించాలన్నారు. హాస్పిటల్ టెండర్‌కు వచ్చిన వారిని అడ్డుకొని, తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. హాస్పిటల్ అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందని, సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రయివేటుకు అప్పగించడం న్యాయం కాదని పేర్కొన్నారు. ఆసపత్రి టెండర్లను వాయిదాలు వేయడం కాదని, పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్లు, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ ప్రయివేటీకరణపై తీసుకున్న నిర్ణయం అన్యాయమని, దీన్ని వెంటనే విరమించుకోవాలని కోరారు. ప్రయివేటీకరణ కొనసాగితే కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.జగన్, జె.సత్యనారాయణ, గణేష్, నాయుడు, రాజగోపాల్ రాఘవులు, కెఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న కార్మికులు

అవంతి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -తగరపువలస : భోగాపురం అవంతి రిసెర్చ్ అండ్ టెక్నాలజికల్ అకాడమీ కళాశాలలో జరిగిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో తమ కళాశాల విద్యార్థుల నమూనాలకు ప్రథమ, ద్వితీయ స్థానాలు లభించినట్లు స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ బి మురళీకృష్ణ గురువారం తెలిపారు. వైజ్ఞానిక వేడుకల్లో తమ కళాశాలతో పాటు భోగాపురం అవంతి రిసెర్చ్ అండ్ టెక్నాలజికల్ అకాడమీ, విజయనగరం గురజాడ, విజయవాడ సిద్ధార్థ, రాజాం జిఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్‌తోపాటు డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్ అధ్యాపకులు అభినందించారు.

విఎంఆర్‌డిఎ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడలో విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ గురువారం పర్యటించారు. మ్యూజియం, మిథిలాపురి ఉడా కాలనీ నుండి వాంబే కాలనీకి వెళ్లే రహదారి, ఉడా రోడ్డులో బాక్స్ క్రికెట్ అవుట్ డోర్ క్రీడా ప్రాంగణానికి స్థల పరిశీలన, నగరపాలెం రోడ్డు మీదుగా ఐటీ కంపెనీలకు రహదారి పరిశీలన, నగరపాలెం రోడ్డు, బక్కనపాలెం రోడ్లకు పెండింగ్ టిడిఆర్ వివరాలు వంటి అంశాలపై మధురవాడ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు.

పి4 సర్వేను వేగవంతం చేయాలి

- 8 నుండి 18వ తేదీ వరకూ
సచివాలయ సిబ్బంది ద్వారా నిర్వహణ
- జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

పేదరికం లేని సమాజం లక్ష్యంగా చేస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం (పి4) సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ గ్రామ /వార్డు సచివాయాల సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం పి4 సర్వేపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి రామారావు, ఎంపిడివోలు, మునిసిపల్ కమిషనర్లు, గ్రామ /వార్డు సచివాలయాల సిబ్బందికి వర్చువల్‌గా సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చడం, వారి జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలో గల 20 శాతం మంది నిరుపేదలను గుర్తించడం ద్వారా పేదరికాన్ని దూరం చేయడమే పి4 విధాన లక్ష్యమని వివరించారు. ఈ సర్వేను ఈ నెల 8 నుంచి 28వ తేదీ వరకు సర్వే చేయాలన్నారు. ప్రస్తుతం అందుకుంటున్న పథకాలపై ఈ సర్వే ఎలాంటి ప్రభావం చూపదని స్పష్టం చేశారు. సర్వే ద్వారా సేకరించిన డేటా ఆధారంగా ఇంటి అవసరాలకు అనుగుణంగా సమర్థవంతమైన ప్రణాళికల రూపకల్పనకు వీలవుతుందన్నారు. వివిధ సామాజిక, ఆర్థిక పరిమితులతో కచ్చితమైన సమాచారాన్ని యాప్‌లో పొందుపరచిన 27 ప్రశ్నల ద్వారా సేకరించాలని ఆదేశించారు. అన్ని శాఖల సమన్వయంతో సమష్టి భాగస్వామ్యంతో సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధికి దిశానిర్దేశంగా నిలిచిన '10 సూత్రాలు' ఫ్రేమ్‌వర్క్‌లో 'జీరో పావర్టీ పి4 పాలసీ' విధానంపై ప్రజల అభిప్రాయం క్యూఆర్ కోడ్, లేదా https:// swarnandhra. ap.gov.in/p4 వెబ్ పోర్టల్ ద్వారా అత్యధిక సంఖ్యలో సేకరించాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ అయిషా

ఎంఎస్ఎంఇ పార్కు వరకు డబుల్ రోడ్డు

ప్రజాశక్తి-సబ్బవరం : లంకెలపాలెం-అనకపల్లి రోడ్డును కలుపుతూ పైడివాడ అగ్రహారం నుండి అనకాపల్లి మండలం కోడూరులోని ఎపిఐఐసి, ఎంఎస్ఎంఈ పార్కుకు 100 అడుగుల విస్తరణ చేసి డబుల్ రోడ్డు నిర్మిస్తామని అనకాపల్లి ఆర్డీఓ షేక్ అయిషా అన్నారు. పైడివాడ అగ్రహారం గ్రామంలో గురువారం జరిగిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ ఈ రోడ్డు విస్తరణ కోసం భూసేకరణ చేయనున్నట్లు, 2.68 కిలోమీటర్ల పొడవున విఎంఆర్‌డిఎ ఆధ్వర్యంలో దీనిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. దీనికి 12ఎకరాల 26 సెంట్లు భూమిని పైడివాడ అగ్రహారం, ఎరుకు నాయుడుపాలెం, కోడూరు గ్రామాలలో సేకరిస్తున్నట్లు తెలిపారు. భూములు కోల్పోయిన రైతులకు విఎంఆర్‌డిఏ ద్వారా టిడిఆర్ బాండ్లు జారీ చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం తహశీల్దారు బి.చిన్నికృష్ణ, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, ఆర్ఐ వీరయ్య, విఆర్‌ఓ దేముడుబాబు, విఎంఆర్‌డిఏ అధికారులు, ఎంపీటీసీ సీరం అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ అక్కిరెడ్డి రామలక్ష్మి దుర్గినాయుడు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కెరీర్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోట రాజీవ్ గాంధీ ఆర్ఇసిఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.ఉమాశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు వారి ఆసక్తి మేరకు ఏ విభాగంలో ఉన్నత విద్యను అభ్యసించాలి? ఆ విభాగంలో వున్న ఉద్యోగ అవకాశాలు ఏంటి? భవిష్యత్తులో విజయం సాధించటానికి ఎలా కృషి చేయాలి? అనే విషయాలపై తెలియజేశారు. అనంతరం ఉమా శంకర్‌ను హెచ్ఎం శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ సూర్యచంద్రరావు, ఉపాధ్యాయులు గోపి, విద్యార్థులు సత్కరించారు.

పూడిమడకలో గంటాలమ్మ ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని పూడిమడక గ్రామంలో నూతనంగా నిర్మించిన గంటాలమ్మ అమ్మవారి ఆలయాన్ని గురువారం వేద పండితుల మంత్రోత్సవాలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. మత్స్యకారులందరూ అమ్మవారికి పసుపు కుంకుమలతో పూజలు చేశారు. అలాగే గొర్లి ధర్మవరంలో మరిడి మహలక్ష్మి అమ్మవారి పండగ సందర్భంగా అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. గ్రామ సర్పంచ్ గొర్లి అశ్విని నూకరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థులకు ఇన్‌స్పైర్ అవార్డులు

ప్రజాశక్తి-యలమంచిలి : మండలంలోని జంపపాలెం హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులకు ఇన్‌స్పైర్ అవార్డులు దక్కాయని హెచ్ఎం శాస్త్రి గురువారం తెలిపారు. 6-10 తరగతులు చదివే పాఠశాల విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు పెంపొందించే ప్రాథమిక లక్ష్యంతో ఈ ఇన్‌స్పైర్- మానక్ అవార్డులు ఇస్తున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా లక్షమందికి గాను అవార్డు పొందిన వారిలో తమ స్కూలుకు చెందిన విద్యార్థులు బల్లా వెంకటేష్, ముత్యాల మోహనసాయి ఉండడం గర్వకారణమన్నారు. ముత్యాల మోహనసాయి డస్ట్‌బిన్ మానిటర్ సిస్టర్ అంశంలోనూ, బల్లా వెంకటేష్ కార్ ఏక్సిడెంట్ ప్రివెన్షన్ రూపొందించిన పరిశోధనలకు గానదు ఇన్‌స్పైర్ అవార్డులు పొందినట్లు హెచ్ఎం శాస్త్రి వివరించారు. రాష్ట్రస్థాయి అర్హత సాధించిన విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున తల్లి అక్కౌంట్‌కు ప్రభుత్వం జమచేస్తుందని తెలిపారు.

ఇన్‌స్పైర్‌కు ఎంపికైన విద్యార్థులు

నూకరత్నంను పరామర్శిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సిడిపిఒ, సూపర్‌వైజర్‌ను విధుల నుంచి తొలగించాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని పోతనవలస అంగన్వాడీ టీచర్ రొంగలి నూకరత్నం ఆత్మహత్యాయత్నానికి కారకులైన ఐసిడిఎస్ సిడిపిఓ మంగతాయారు, సూపర్వైజర్ రాములమ్మను విధుల నుంచి తొలగించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, రైతు సంఘం నాయకులు రొంగలి ముత్యాలనాయుడు, ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, సిఐటియు నాయకులు ఈ.నాయుడుబాబు గురువారం తహశీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన సిడిపిఓ, సూపర్ వైజర్ రికార్డులు సక్రమంగా లేవని కారణంగా అంగన్వాడీ కార్యకర్తను వ్యక్తిగతంగా దూషించారని తెలిపారు. దీంతో తీవ్రంగా మనస్థాపానికి గురైన నూకరత్నం చీమల మందును తాగి ఆత్మహత్యకు యత్నించిందని చెప్పారు. కింద స్థాయి ఉద్యోగులు వారు పనిలో లోటుపాట్లు ఉంటే వారికి నోటీసులు ఇచ్చి తదుపరి చర్యలు తీసుకోవాలి తప్ప వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. తహశీల్దారు వెంటనే స్పందించి ఐసిడిఎస్ సిడిపిఓ, సూపర్వైజర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నూకరత్నాన్ని ప్రజా సంఘాల నాయకులు పరామర్శించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని వెంకటాపురం సబ్ స్టేషన్ మెయింటెనెన్స్, 11కెవి త్రీ కటింగ్ వసుల కారణంగా ఈ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 7న శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎస్.గోపి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని వెంకటాపురం, తోటాడ, గవర్ల అనకాపల్లి, టి సిరసపల్లి, మూలపేట గ్రామాలకు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

యలమంచిలి : మండలంలోని రేగుపాలెం ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు జరుగుతున్న కారణంగా ఈ నెల 7న విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతుందని ఎపిఈపిడిసిఎల్ ఈఈ కె.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని కృష్ణాపురం, లక్కవరం, రుక్మిణీపురం, జగనన్న కాలనీ, నాయనంపాలెం గ్రామాల్లో ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతుందని పేర్కొన్నారు.

ఆశా కార్యకర్తల గృహ నిర్బంధం

ప్రభుత్వ చర్యలను ఖండించిన సిఐటియు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

కూటమి ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ చలో విజయవాడ బయలుదేరుతున్న ఆశా కార్యకర్తలపై ప్రభుత్వ నిర్బంధ చర్యలకు పాల్పడింది. మండలంలోని పలువురు ఆశా కార్యకర్తల ఇళ్లకు పోలీసులు వెళ్లి సెల్‌ఫోన్ లాక్కొని, గృహ నిర్బంధం చేశారు. ప్రభుత్వ, పోలీసు చర్యలను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. చలో విజయవాడ వెళ్తున్న వారిని నిర్బంధించడం అన్యాయమన్నారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలకు పెంచాలన్నారు. మహిళా దినోత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో మహిళలపై దాడులు చేయడం హేయమన్నారు.

ఆశా కార్యకర్తను గృహ నిర్బంధం చేసిన పోలీసు

నమూనా పరీక్షల్లో విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన పదవ తరగతి నమూనా పరీక్షల్లో ప్రతిభ చూపిన వారిని గవరపాలెం గర్ల్స్ హైస్కూల్లో గురువారం బహుమతుల ప్రదానం చేశారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన దిశ ఎస్సై బి యమునా మాట్లాడుతూ విద్యార్థినుల బాగా చదివి మంచి మంచి స్థానాల్లో ఉండాలని సూచించారు. పరీక్షల పట్ల భయాందోళన పడనవసరం లేదన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. రమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో నెలకొన్న భయాందోళన పోవడానికి ఇటువంటి పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పదవ తరగతి మోడల్ టెస్ట్‌లో కె.ఉమాదేవి (భాష్యం స్కూల్), బి.మోహిత్ (ప్రశాంతి నికేతన్), వి.రాజదీప్ (భాష్యం స్కూల్) కె.శృతిశ్రీ (నారాయణ స్కూల్) పి.భాగ్య అనన్య (శ్రీ చైతన్య స్కూల్) డి.మోక్షిత (టౌన్ గర్ల్స్ హైస్కూల్), ఎస్. రేవతి (విశ్వశాంతి హైస్కూల్), వి.పావని (కృష్ణవేణి స్కూల్), పి.వంశీకృష్ణ (గురజాడ స్కూల్), ఎం.జగదీష్ సుబ్బలక్ష్మి (గవరపాలెం గర్ల్స్ హైస్కూల్) విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.బాలాజీ, డివిజన్ కార్యదర్శి ఎం.నూకరాజు, వెంకటేశ్వర స్కూల్ ఆఫ్ నర్సింగ్ కరస్పాండెంట్ నాయుడు, స్థానిక హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో డిఎంహెచ్ఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట మండలం, తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాల గురించి సమీక్షించి, రికార్డ్స్, రిపోర్ట్స్ పరిశీలించారు. క్షేత్ర స్థాయి సిబ్బంది ఆధ్వర్యంలో అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు శత శాతం లక్ష్యాలు సాధించాలని సూచించారు. పిహెచ్‌సిలో వాక్సిన్స్, కోల్డ్‌చైన్ నిర్వహణ, మందుల స్టోర్స్ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఏ.సుబ్బారావు, ఆరోగ్య బోధకులు ఎంఎస్‌వి.ప్రసాద్, సిబ్బంది కెఎన్ఆర్‌కెజె.నరసింహారావు, ఆర్.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 8వ తేదీ నుండి నెలాఖరి వరకు జరుగు ప్రజా చైతన్య యాత్రల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల హక్కుల కోసం ఈ యాత్రలు గళం విప్పుతాయన్నారు. మార్చి 8 నుండి జరగనున్న యాత్రలలో గుర్తించిన సమస్యల పరిష్కారం కోరుతూ మార్చి 24, 25 తేదీల్లో మండల కార్యాలయాల వద్ద మహా ధర్నాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల అధ్యయనం కోసం జిల్లా వ్యాప్తంగా పర్యటనలు జరుగుతాయని, పాదయాత్రలు, సైకిల్ యాత్రలు చేస్తామని చెప్పారు. సూపర్ సిక్స్ అమలు చేయాలన్నారు. కొత్త ప్రభుత్వంలో అయినా తమ సమస్యలు పరిష్కారం అవుతాయని, భావించామని చెప్పారు. బడ్జెట్లో రాయితీలు ఏమైనా ఇస్తారోమోనని తొమ్మిది నెలలపాటు ప్రజలు ఎదురు చూశారని వారి ఆశలు అడియాశలు అయ్యాయని పేర్కొన్నారు. సూపర్‌సిక్స్ పథకాలకు నిధులు తగ్గింపు ద్వారా వాటిని కుదించే ప్రయత్నం చేశారని విమర్శించారు. పి4 పేరుతో 20 శాతం మంది లబ్ధిదారులను తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యుత్ భారాలు మోపారని, అవసరం లేకపోయినా అదానీకి కోట్లు కట్టబెట్టేందుకు స్మార్ట్ మీటర్లు పెట్టారని, వాటిని ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పరిశ్రమల పేరుతో సేకరించిన భూములకు పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వకుండా నిర్వాసితులను ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. మూసివేసిన సుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని ఇచ్చిన హామీ అమలుకాలేదని గుర్తు చేశారు. మత్స్యకారుల వేట నిషేధ భృతి నేటికీ చెల్లించలేదు. స్థానిక పరిశ్రమల్లో 75శాతం ఉద్యోగాలు కల్పించలో ప్రభుత్వం విఫలమైందని, రోడ్లు, మంచినీరు తదితర సమస్యలపై పెద్దఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని తెలియజేశారు.

దొంకాడకు రోడ్డు సౌకర్యం కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనకాపల్లి : గొలుగొండ మండలం కె.ఎల్లవరం పంచాయితీ దొంకాడ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు గురువారం ఆయన లేఖ రాశారు.

మాట్లాడుతున్న పోతల పాత్రునాయుడు

రైవాడ ప్రాజెక్టు పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-దేవరాపల్లి : రైవాడ ప్రాజెక్టు పరిధిలో అభివృద్ధి పనుల సాధ్యసాధ్యాలను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రైవాడ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పోతల పాత్రు నాయుడు అన్నారు. స్థానిక రైవాడ అతిథి గృహంలో గురువారం ప్రాజెక్టు పరిధిలోని సాగునీటి సంఘాల అధ్యక్షులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనరులు కాపాడుకొని ప్రతి రైతుకు సాగునీరు అందించడానికి కలిసి పని చేస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సహకారంతో రైవాడ జలాశయం, సాగునీటి కాలువలు, చెరువులు అభివృద్ధి పరిచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ బొడ్డు ఉమాదేవి, జలాశయం డిఈ ఆర్.సత్యంనారాయుడు, సాగునీటి సంఘాల అధ్యక్షులు, టిడిపి నాయకులు కొమర బాబురావు, దొగ్గ దేముడు నాయుడు, రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సర్వ శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు గురువారం స్థానిక మండల విద్య శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. మినిమమ్ టైమ్ స్కేల్, హెచ్ఆర్ పాలసీ అమలు చెయ్యాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యాలయంలో సిబ్బంది వెంకట్రావు, సన్యాసిరావు, రమణ పాల్గొన్నారు.

మామిడి దిగుబడికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో మామిడి పంట ప్రస్తుతం పిందె దశల్లో ఉందని, ఈ దశలో శాస్త్రవేత్తలు సూచించిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి.ప్రభాకర రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మామిడి పూత విచ్చుకున్నప్పటి నుంచి తేలికపాటి తడులతో ప్రారంభించి నీటిని ఇవ్వాలని తెలిపారు. పిందె కట్టిన దశలో రెండవ దఫా సిఫారసు చేసిన ఎరువులను వేసుకోవాలన్నారు. తేనె మంచు పురుగు నివారణకు లీటర్ నీటికి బుప్రోఫిజిన్ 1.5 ఎంఎల్ లేదా బుప్రోఫిజిన్ o అసిఫేట్ 1జి లేదా డైనోటేఫ్యురాన్ 0.2జితో పాటు వేప నూనె 3 మిల్లీలీటర్లు, జిగురు 0.5 మిల్లీలీటర్లు కలిపి పిచికారి చేయాలని కోరారు. తామర పురుగు నివారణకు, నీలం రంగు జిగురు అట్టలు చెట్టు మార్చి చెట్టుకు, ఒకటి చొప్పున పెట్టుకోవడం, పాదులో ఫాలిడాల్/ క్లోరోపైరిఫాస్/వేప పిండి వేయడం ద్వారా నిద్రావస్/ కోశస్థ దశలను నిర్మూలించడం, ఫిప్రోనిల్ 2 మిల్లీలీర్లు, లేదా అసిఫేట్ 1.5జి లేదా ఇమిడా 0.5 మిల్లీలీటర్లు, లేదా థయోమెథాక్సామ్ 0.3 గ్రాములు లేదా స్పైనోశాడ్ 0.4 మిల్లీలీటర్లు, లేదా ప్రొఫెనోఫాస్ 2 మిల్లీలీటర్లు, లేదా అసిటామిప్రిడ్ 1జి లేదా డైమిథోయేట్ 2 మిల్లీలీటర్లు, వేపనూనె 10000 పిపిఎం, 2 మిల్లీలీటర్లు, పిచికారి చేయాలని సూచించారు. నాణ్యమైన పండ్ల దిగుబడికి కాయ నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు పండ్ల కవర్లను తొడగాలన్నారు. అధికంగా పూత, పిందె రాలుతున్నప్పుడు ప్లానోఫిక్స్ 2 మిలి/10లి నీటికి కలిపి, దోమ ఎక్కువ కాకుండా, వేరే ఇతర మందులతో కలపకుండా ఉదయం/సాయంకాల సమయాల్లో పిచికారి చేయాలన్నారు. జీవన ఎరువులను 250 గ్రా చొప్పున పశువుల ఎరువులో కలిపి వాడుకోవడం ద్వారా మొక్కకి పోషకాల లభ్యతను పెంచవచ్చునని పేర్కొన్నారు. కాయ పెరిగే దశలో 13:0:45 10గ్రా/లీ. యూరియా 5గ్రా/లీ పిచికారి చేస్తే కాయ ఎదుగుదలకు తోడ్పడుతాయని తెలిపారు.

చలో విజయవాడను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న జరిగే ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోన లక్ష్మణ పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఓపెన్ హౌస్

విద్యార్థులకు పోలీసు ఆయుధాలు గురించి వివరిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి-అనకాపల్లి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం, మహిళా సాధికార వారోత్సవాలలో భాగంగా గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ కాలేజీల విద్యార్థినులకు ఓపెన్ హౌస్ ఏర్పాటు చేశారు. డైట్ కాలేజ్, హిమశేఖర్ డిగ్రీ కాలేజ్, ఆదినారాయణ మహిళా డిగ్రీ కాలేజ్, ఎఎంఎఎల్ డిగ్రీ కాలేజ్ విద్యార్థినులు ఈ ఓపెన్ హౌస్‌ను సందర్శించారు. వారికి పోలీసులు విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు ఇతర భద్రతా పరికరాలను గూర్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ మహిళా సాధికార వారోత్సవాల్లో భాగంగా విద్యార్థినులకు ఆటలు, చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, సాంస్కృతిక కార్యక్రమాల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్య ఉద్యోగ సాధనపై మహిళలు అవగాహన పెంచుకొని హక్కులు రాబట్టుకోవాలన్నారు. మహిళల హక్కులు, సమానత్వం, భద్రత, రక్షణ కోసం పోలీసులు తీసుకుంటున్న చర్యలను తెలియజేశారు. మహిళలు ధైర్యంగా ఉండాలని, చదువుకొని, ఆర్థికంగా స్వతంత్రంగా ఉండాలని కోరారు. మహిళలు, బాలికలు ఎలాంటి ప్రమాదంలో చిక్కుకున్నా వెంటనే సహాయం అందించేలా హెల్ప్‌లైన్ నెంబర్లు వారికి తెలియజేసి, పోలీసుల సహాయం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీలు బి.అప్పారావు, ఈ.శ్రీనివాసులు, ఏఆర్ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, బాల సూర్యారావు, రామకృష్ణారావు, మన్మధరావు, వెంకటచిట్టి, ఎస్సైలు వెంకన్న, సురేష్ బాబు, ఆదినారాయణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట పోలీస్ స్టేషన్‌లో సిఐ అల్లు స్వామి నాయడు ఆధ్వర్యంలో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక బాలికల హైస్కూల్ విద్యార్థినుల దీనిని సందర్శించారు. ఎస్ఐ మనోజ్ కుమార్ పోలీసు వ్యవస్థ, చట్టాలు, బాలికలు, మహిళల భద్రతకు సంబంధించిన అంశాలు, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే సహాయ హెల్ప్‌లైన్ నంబర్లు (100, 112, 181, 1098) గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సి సూర్యారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం తుమ్మపాలలో శ్రీవేణుగోపాలస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయ పంచమ వార్షికోత్సవ మహోత్సవం, ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పడాల గణపతి రావు శారద దంపతులతో రుత్వికులు ధ్వజస్తంభ ప్రతిష్ట చేయించారు. స్వామివారిని జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ), వైసిపి యువ నాయకులు మలసాల కుమార్ రాజా, ఏపీఐడబ్ల్యుఎ మాజీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, జనసేన నాయకులు గొల్ల బాబు, చదరం నాగేశ్వరరావు, కర్రి వెంకట సన్యాసినాయుడు తదితరులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు పడాల గణపతిరావు, పస్నీరు వెంకటలక్ష్మి కొండలరావు, వడ్డాది అశోక్ భారతి, పంచదారల కన్నారావు, ఎరుబండి సత్యనారాయణ, కనుబుడ్డి శంకరావు, పస్నీరు రమణ పాల్గొన్నారు.

అక్రమ కేసుపై విచారణ జరపాలి

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని పరవాడపాలెం వైసిపి నాయకుడు గొంతిని శివపై పెట్టిన అక్రమ కేసుపై విచారణ జరపాలని వైసిపి మండల అధ్యక్షులు మలసాల కిశోర్, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్య నాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మండలంలోని ఎంపిటీసీలు, సర్పంచులు ముఖ్య నాయకులతో కలిసి కశింకోట పోలీస్ స్టేషన్‌కు వచ్చి స్థానిక ఎస్సై మనోజ్ కుమార్‌తో చర్చించారు. కేసుపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.

శివాలయం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలోని శివాలయం నిర్మాణానికి సబ్బవరం గ్రామానికి చెందిన జిఎస్ కన్వెన్షన్, లక్ష్మీ శ్రీనివాస్ బోర్వెల్స్ అధినేత గవర శ్రీనివాస్ రూ.1,00,116 విరాళం గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బర్ల రమణ, గెడ్డం కృష్ణ, దంగేటి నాని, దంగేటి ప్రకాష్, దెడ్డం ప్రసాదరావు, ధనిమిరెడ్డి శ్రీనివాసరావు, కొల్లి కృష్ణ, చింతల శీను, మురి కనకరాజు, గొంప వెంకినాయుడు, గెడ్డం రమేష్, త్రినాథ్, సూర్యారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయం నిర్మాణానికి..

దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో ఆర్యవైశ్య ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి స్థానిక వర్తకులు గుండు రాంబాబు, గుండు ఈశ్వరరావు రూ.20వేలు విరాళాన్ని గురువారం మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు ఆధ్వర్యంలో ఆర్య వైశ్య సంఘ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పెద్దాడ వెంకటరమణ, సంఘం సభ్యులు కొల్లూరు పైడిశెట్టి, వెచ్చ రమేష్, పసుమర్తి విశ్వేశ్వరరావు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు 15 మద్యం దుకాణాలు కేటాయింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా మద్య నిషేధ అబ్కారి శాఖ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లాలో కల్లుగీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలను జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ ప్రక్రియ ద్వారా గురువారం ఎంపిక చేశారు. స్థానిక గుండాల కూడలి వద్ద జివిఎంసి, ఎస్ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లాలో గీత కులాలకు కేటాయించిన 15 మద్యం దుకాణాలకు 205 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. మద్యం షాపు దక్కించుకున్న దరఖాస్తుదారుడు వెంటనే అదేరోజు రిటైల్ ఎక్సైజ్ టాక్స్ రూ.5,41,667 లేదా రూ.4,58,333 మొదటి విడతగా చెల్లించి ప్రయోజనాలు లైసెన్స్ పొందాలని సూచించారు. ఈ 15 మద్యం దుకాణాల కేటాయింపునకు నాన్ రిఫండబుల్ కింద రూ.4.10 కోట్లు ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. 15 మద్యం దుకాణాలు కేటాయింపునకు లైసెన్స్ ఫీజు కింద రూ.78,75,003 ఆదాయం లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మద్య నిషేధ అబ్కారి శాఖ అధికారి వి.సుధీర్, సహాయ అధికారి రాజశేఖర్, సిఐలు, ఎస్ఐలు, దరఖాస్తుదారులు, కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని సింగవరం రెవెన్యూ పరిధిలో ఉపాధి హామీ పనులను అడ్డుకున్న వారికిపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించాలని కోరుతూ మండలంలోని లోపూడి సింగవరం ఉపాధి హామీ కూలీలు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. సింగవరం రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 60లో గురువారం కూలీలు ఉపాధి హామీ పనులు చేస్తుండగా, గ్రామానికి చెందిన వ్యక్తులు పనులు అడ్డుకొని దాడులు చేయడానికి ప్రయత్నించారని తెలిపారు. గ్రామంలో సుమారు 300 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిలో పలువురు ఆక్రమణలకు దిగుతున్నారని, ఉపాధి హామీ పనులను సైతం చేయకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. అనంతరం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వేపాడ మధు, వ్యానం శ్రీను పాల్గొన్నారు.

రేపు యలమంచిలి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి పరిషత్తు సర్వసభ్య సమావేశం ఈ నెల 8న శనివారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ కొండలరావు తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

నర్సరీ ప్లాంట్‌ను పరిశీలించిన ఎంపిడిఓ

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని జానకయ్య పేట, సిహెచ్ లక్ష్మీపురం గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీ ప్లాంట్‌లను ఎంపిడిఒ డి సీతారామరాజు గురువారం పరిశీలించారు. సరుగుడు, నీలగిరి, జామ, దానిమ్మ, కరివేపాకు, తులసి, సీతాఫలం, మునగ, మారేడు, జమ్మి ఇతర జాతుల మొక్కలను నర్సరీలో పెంచుతున్నారు. ఏయే రకాలు మొక్కలు, ఎన్ని పెంచుతున్నారో, ఎంతమంది కూలీలు పని చేస్తున్నారో ఎంపిడిఒ ఆరా తీశారు. మొక్కలను జాగ్రత్తగా పెంచాలని, .జూన్ నెలలో రైతులకు మొక్కలను సరఫరా చేస్తామని వెల్లడించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కురందాసు నూకరాజు, కంప్యూటర్ ఆపరేటర్ సాయి కిరణ్, వన సేవకుడు కురుందాసు అప్పలరాజు పాల్గొన్నారు.

దేవాలయ భూమి ఆక్రమణల గుర్తింపు

ప్రజాశక్తి - కొత్తకోట : రావికమతం మండలం దొండపూడి గ్రామ సమీపంలో దుర్గాలమ్మ ఆలయానికి చెందిన సుమారు23 సెంట్లు స్థలాన్ని గ్రామానికి చెందిన పెచ్చేట్టి చంద్రమణి, ఆమె కుమారుడు మణిరాజు ఇద్దరు కలిసి ఆక్రమించినట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. మండల రెవెన్యూ తహసీ ల్దార్ వెంకటరమణ ఆధ్వర్యంలో గురువారం సర్వే చేపట్టి సరిహద్దులు ఏర్పాటు చేశారు.ఆలయ భూమి ఆక్రమణపై ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు చొరవ తీసుకుని, రెవిన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌కు లేఖ రాయడంతో రెవెన్యూ అధికారులలో కదలిక వచ్చింది. దొండ పూడి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 269/21లో 23 సెంట్లుస్థల ఆక్రమణ సమస్యపై ఆలయ కమిటీ సభ్యులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో, స్థానికులు ఎమ్మెల్సీ చిరంజీవిరావు దృష్టికి తీసుకెళ్లారు దీనితో జిల్లా, మండల స్థాయి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఆగమేఘాలపై సర్వే చేపట్టి ఆక్రమణనకు గురైన స్థలాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నా రు. సరి హద్దులు ఏర్పాటు చేసి ఆలయ కమిటీ సభ్యలకు అప్పగించారు కార్యక్రమంలో ఆర్ఐ సతీష్, విఆర్ఒ మూర్తి, మండల సర్వేయర్ తో పాటు గ్రామ ఉపసర్పంచ్ రాజారావు మాజీ సర్పంచ్ తాతబాబు, మాజీ ఉప సర్పంచ్ వెంకటాచారి,ఆలయ కమిటీ సభ్యులు గత్రేడ్డి శ్రీనివాస్, గత్రేడ్డి వెంకట సత్యం పాల్గొన్నారు.

అటవీశాఖకు అధికాదాయం వచ్చేలా చర్యలు

ప్రజాశక్తి-గొలుగొండ : వెదురు, టేకు అమ్మకాలతో అటవీశాఖకు ఎక్కువ ఆదాయం వచ్చేటట్లుగా చర్యలు తీసుకుంటున్నామనినర్సీపట్నం డిఎఫ్ఒ శామ్యూల్ అన్నారు. ప్రతి నెలలో కలప డిపో వద్ద వేలంపాట నిర్వహించే కార్యక్రమంలో భాగంగా గురువారం గొలుగొండ కలప డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారుల సమక్షంలో వేలంపాట నిర్వహించారు కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ లక్ష్మణరావు, రేంజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాతునాయుడు కుటుంబానికి న్యాయం చేస్తాం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ఇటీవల లారీ ప్రమాదంలో మరణించిన మాతునాయుడు కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. గురువారం విజయ్‌ను మాతునాయుడు కుమార్తె సుర్ల సుశీల, అల్లుడు సుర్ల రాజబాబు కలిసి, మాతునాయుడు ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరిపించి తగిన న్యాయం చేయాలని కోరారు. దీనిపై విజయ్ స్పందించి టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావుతో మాట్లాడి, ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఘటనపైపూర్తి విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు శృంగవరం పార్టీ అధ్యక్షుడు కులబాల బాపిరాజు తదితరులు ఉన్నారు.

పట్నం జనసేనలో జగడం!

- ఆవిర్భావ దినోత్సవ వేళ పోటాపోటీగా పోస్టర్ల ఆవిష్కరణ
- వైసిపి నేతలతో కొందరు నాయకుల చెట్టపట్టాల్
- పరిణామాలను నిశితంగా గమనిస్తున్న పార్టీ శ్రేణులు

గ్రూపులుగా విడిపోయి నర్సీపట్నంలో పోటాపోటీగా ఆవిర్భావ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జనసేన నేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం పట్టణంలో జనసేన పార్టీలో జగడాలకు తెరలేచినట్లు కనిపిస్తోంది. కొన్నేళ్లుగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో జనసేన బలోపేతానికి, పార్టీ పరంగా కార్యక్రమాలను సమన్వయకర్త రాజాన వీర సూర్యచంద్ర నిర్వహిస్తూ వస్తున్నారు. ఎనలేని పోరాటాలు చేశారు. అలాగే నియోజకవర్గంలో పట్టు సాధించారు. అయితే ఇటీవల కొంతకాలంగా సూర్య చంద్రకు, నర్సీపట్నం టౌన్ జనసేన నాయకులకు మధ్య ఉన్న విభేదాలు ఇప్పుడు జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బహిర్గతమౌతున్నాయి. జనసేన ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర నాయకత్వం పిలుపుతో నియోజవర్గంలోని నాలుగు మండలాల్లోనూ సమన్వయకర్త సూర్యచంద్ర పోస్టర్ ఆవిష్కరణ, ఇతర కార్యక్రమాలను నిర్వహిస్తూ సమన్వయంతో ముందుకు పోతుండగా, నర్సీపట్నం మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య భర్త అద్దేపల్లి గణేష్ కొంతమందిని కూడగట్టి సొంతంగా ఆవిర్భావ దినోత్సవం పోస్టరును వేరేగా ఆవిష్కరించారు. దీంతో పార్టీలో అంతర్గత విభేదాలున్నాయా అనే ప్రశ్న తలెత్తుతోంది.

గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించిన జనసేన, అనేక సమస్యలపై పోరాడింది.సూర్యచంద్ర నేతృత్వంలోనే అందరినీ సమన్వయం చేసుకుంటూ, నిరసనలు ధర్నాలు చేపట్టారు. అయితే కౌన్సిలర్ సౌజన్య భర్త అద్దేపల్లి గణేష్ మాత్రం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాత్రం నాటి ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపుతూ, తర్వాత వాటిని వదిలేయడం జరిగేది. అలాగే జనసేన పార్టీలో కొందరు వ్యక్తులు వైసిపి నాయకులతో కొన్ని కార్యక్రమాల్లో చెట్టాపట్టాలేసుకుని తిరగడం కూడా నియోజకవర్గంలో జనసేన శ్రేణులకు మింగుడు పడటం లేదు. ఇటీవల సూర్యచంద్ర ఆ ఫోటోలను సోషల్ మీడియాలో వైరల్ చేశారు పార్టీని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో . రాజాన సూర్యచంద్ర బీసీ కార్పొరేషన్ పదవి ఇవ్వడం జనసేనలోకొందరు జీర్ణించుకోలేకపోతున్నారనే వార్తలు వినబడుతున్నాయి ఈ నేపథ్యంలోనే సూర్యచంద్రను పక్కనపెట్టి ఎవరిమానాన వారు కార్యక్రమాలను చేసుకుపోతుండగా, ఇపుడు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పోటాపోటీగా పోస్టర్లు ఆవిష్కరణతో వ్యవహారం బహిర్గతమైంది. ఈ పరిణామాలన్నీ ఎటు దారి తీస్తాయోనని జనసేన శ్రేణులు ఆందోళన చెందుతుండగా, ఏడేళ్లుగా పార్టీకోసం శ్రమిస్తున్న సూర్యచంద్రను ఇన్‌ఛార్జిగా కొనసాగిస్తారా? లేదా అనేది ఇపుడు చర్చనీయాంశంగా మారడం విశేషం.

ఉపమాక వెంకన్న కల్యాణోత్సవాలకు చకచకా ఏర్పాట్లు

అధికారులు, నేతలకు ఆహ్వానపత్రికలు ఇస్తున్న ఆలయ కమిటీ

ప్రజాశక్తి- నక్కపల్లి: ఉపమాక వెంకన్న వార్షిక తిరు కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. (ఏటా ఫాల్గుణ శుద్ధ ఏకాదశి నుంచి స్వామి కల్యాణోత్సవాలు నిర్వహిస్తుంటారు. రాష్ట్రం నలుమూలల నుండి వేలాది మంది భక్తులు ఉత్సవాల్లో పాల్గొనేందుకు, స్వామి దర్శించుకునేందుకు రానున్న నేపథ్యంలో టిటిడి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే ఆలయ గోపురాలకు, గరుడాద్రి పర్వతం, మెట్ల మార్గానికి, ఆలయ పరిసర ప్రాంతంలోనూ, నక్కపల్లి నుండి ఉపమాక మార్గాన లైటింగ్ పనులు జరుగుతున్నాయి. గాలిగోపురం ఎదురుగా భక్తుల సౌకర్యం కోసం ఎండ తీవ్రత లేకుండా తాత్కాలిక రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. క్యూ లైన్లు, ఆలయ ప్రాంగణంలో, కేశఖండనశాల, పుష్కరిణి వద్ద క్లాత్ డెకరేషన్ చేపట్టారు. పుష్కరిణిలో భక్తులు స్నానాలు ఆచరించేందుకుగాను జల్లు స్నానానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

అధికారులు, నేతలకు ఆహ్వానం

ఉపమాక వెంకన్న వార్షిక తిరు కల్యాణోత్సవాలకు రావాలని గురువారం అధికారులకు, హెటిరో కంపెనీ ప్రతినిధులకు తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, కూటమి నాయకులు ఆహ్వాన పత్రిక అందజేసారు. స్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఈనెల 9న అంకురార్పణతో ప్రారంభమై 17న ముగుస్తాయి.10న ధ్వజారోహణం, రథోత్సవం, కల్యాణోత్సవం నిర్వహిస్తారు. స్వామి ఉత్సవాలు సందర్భంగా ఆర్‌డిఒ వివి రమణ, తహసిల్దార్ నరసింహమూర్తి, ఎంపిడిఒ డి సీతారామరాజు, ఎంఇఒ నరేష్, హెటిరో కంపెనీ ప్రతినిధులు సుబ్బారెడ్డి, కుల్లారెడ్డి, రాజారెడ్డిలకు ఆహ్వాన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కూ టమి నాయకులు కురందాసు నూకరాజు, గింజల లక్ష్మణరావు, రెడ్డి వరహాలు బాబు, శంకర్రావు, తోలేటి శ్రీనివాస్, పుణ్యమంతుల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

జీడిమామిడికి తేనె మంచు దెబ్బ!

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో రెండు రోజులుగా తేనెమంచు విస్తారంగా కురవడంతో జీడి మామిడి రైతుల్లో ఆందోళన మొదలయ్యింది .ఇప్పటికే పూత పిందెదశలో ఉన్న సమయంలో కురుస్తున్న మంచు కారణంగా పంట దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా రైతులు జీడి మామిడి పంటపై ఎక్కువగా ఆధారపడి జీవిస్తూ ఉంటారు, ఇప్పటికే రైతులు తొలి మలి దశలో వివిధ రకాల క్రిమిసంహారక మందులు పిచికారి చేసి ఉన్నారు, సంక్రాంతి సమయం నుంచి నానా ప్రయాసలు పడి పంటను రక్షించుకుంటూ వస్తున్నారు, అయితే ఈ ఏడాది పూత ఆశాజనకంగా ఉండడంతో దిగుబడి బాగుంటుందని ఆశిస్తున్న సమయంలో, రెండురోజులుగా విపరీతమైన పొగ, తేనెమంచు కురియడంతో పంట పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఇటువంటి పరిస్థితుల్లో మండలంలో రెగ్యులర్ ఉద్యానవన అధికారి లేకపోవడం, ఇన్‌ఛార్జి ఎపుడు అందుబాటులో ఉంటారో తెలియని పరిస్థితుల్లో రైతులు పురుగుల మందుల దుకాణాల చుట్టూ తిరుగుతూ, వారి సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు చేపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ హార్టికల్చర్ అధికారిని నియమించి, రైతులకు సాగు సూచనలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

తేనెమంచుతో నల్లబారిన జీడిమామిడి పూత

సంఘం బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - రావికమతం: తూర్పు కాపు సంక్షేమ సంఘం బలోపేతానికి కులస్తులంతా ఐక్యం కావాలని తూర్పు కాపు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కరణం శ్రీహరి తెలిపారు. గురువారం రావికమతం సర్పంచ్ గంజి మోదినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సంఘం సమావేశంలో శ్రీహరి మాట్లాడుతూ, మండల, గ్రామస్థాయిలో పూర్తిస్థాయి కమిటీలను ఏర్పాటుచేసి, తద్వారా సంఘం బలోపేతంతోపాటు సమస్య పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు సిరిగిరిశెట్టి నానాజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెలంశెట్టి శ్రీనివాసరావు, ముఖ్య సలహాదారుడు అడపా శేషగిరిరావు, చప్పా వెంకట అప్పారావు, కాళింగి తాతలు, వెలంశెట్టి శశిరావు పాల్గొన్నారు.

పి4 సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల : ఈనెల 8నుంచి చేపట్టే పి4 సర్వేను పారదర్శకంగా చేపట్టాలని ఇఒపిఆర్‌డి రఘురామ కోరారు. గురువారం మండల సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బందితో సమావేశంలో మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర మిషన్‌లో భాగంగా పేదరిక నిర్మూలనకు దారిద్య రేఖ దిగువన ఉన్న 20 శాతం మంది వివరాలను సర్వేద్వారా సేకరించాలన్నారు. నిర్ధేశించిన 18ప్రశ్నలకు ప్రజల నుంచి వివరాలను రాబట్టి, సర్వే ఫారాలలో పొందుపరచాలన్నారు. సర్వే సమయంలో సంబంధిత ఇంటి యజమాని అందుబాటులో లేకపోతే మళ్లీ వెళ్లి వివరాలు సేకరించాలేగానీ, తప్పుడు వివరాలు పొందుపరచరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఇఒ రామారావు, పలువురు కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాష్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు గురువారం హెటిరో డ్రగ్స్ ఆధ్వర్యంలో నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత (వాష్) పై శిక్షణ ఇచ్చారు. కంపెనీ ప్రతినిధులు యస్. కుల్లా రెడ్డి,ఎమ్. సుబ్బారెడ్డి, యన్. రాజారెడ్డి, ఎంఇఒ నరేష్, హెచ్ఎం రాణి లలిత కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ట్రైనర్లు పద్మజ, మల్లేశ్వరి, అరుణ్ కుమార్ రెడ్డి, రాజు కలిసి (వాష్)పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. పిల్లలకు స్వచ్ఛమైన నీరు అందించడం, పారిశుధ్య పరిరక్షణ, పరిశుభ్రత పాటించడం వల్ల పిల్లలు వ్యాధుల బారిన పడకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో సిఎస్ఆర్ ప్రతినిధి సిహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కెమికల్ ట్యాంకర్ బోల్తా

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని ఒడ్డిమెట్ట జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి ఎసోటోన్ కెమికల్ తీసుకు వెళ్తున్న ట్యాంకర్ బోల్తా పడింది. తుని వైపు నుంచి పరవాడకు ఎసోటోన్ కెమికల్ ను తీసుకు వెళ్తుండగా ఒడ్డిమెట్ట వద్ద ప్రమాదవశాత్తు ట్యాంకర్ బోల్తా పడింది. సిఐ కుమారస్వామి, స్థానిక అగ్నిమాపక సిబ్బందితో వెళ్లి ట్యాంకర్‌ను బయటకు తీయించారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పశు బీమా పథకం పునరుద్ధరణ

ప్రజాశక్తి-రోలుగుంట : ప్రీమియంలో 80 శాతం రాయితీతో పాడి పశువులు, దుక్కిటెద్దులు,, గొర్రెలు, మేకలకు మూడేళ్ల బీమా పథకాన్ని పునరుద్ధరించారని రోలుగుంట పశువైద్యాధికారి నూకేశ్వరరావు తెలిపారు. గురువారం రోలుగుంటలో పశు బీమా నమోదును ప్రారంభించారుఈ పథకం ద్వారా కేవలం రూ.400 ప్రీమియంతో మూడేళ్లకు తమ పశువులకు బీమా చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల వారు పశు వైద్య సహాయకులను, రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నేషనల్ అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా సమన్వయకర్త వెంకట్ గణేష్, గోపాల మిత్ర రాజు, పశు సంవర్ధక సహాయకులు శివ, రైతులు పాల్గొన్నారు.

గిరి బాలలకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-కొత్తకోట : రావికమతం మండలం చీమలపాడు శివారు ములకలపల్లి, కల్యాణపులోవ, జెడ్.జోగంపేట, తాటిపర్తి, కొంజుర్తి, దోకులంపాడు, ధర్మవరం గ్రామాలలో గిరిజన ప్రాథమిక పాఠశాలలకు చెందిన 460 మంది విద్యార్థులకు యలమంచిలికి చెందిన సమిధ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం సుమారు రూ 30 వేలు విలువైన నోట్ బుక్స్, టేబుల్ బుక్స్, పెన్నులు, వేరుశెనక చక్కిలు, గుడ్‌డే బిస్కెట్స్, సంతూర్ సబ్బులు అందజేశారు .ఈ సందర్భంగా సమిధ సంస్థ కార్యదర్శి డి. వీరభద్రరావు మాట్లాడుతూ కొంతమంది దాతల సహకారంతో గిరిజన విద్యార్థులకు వీటిని పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పౌష్టికాహారం ప్రాముఖ్యత, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత, హాండ్ వాష్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు నల్లి కల్యాణ్, సంస్థ ప్రతినిధులు కర్రి నాగేశ్వరరావు, అశ్వని, కిడారి లక్ష్మి, సిద్ధబత్తుల లక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లను సరిచేసిన సిబ్బంది

◆ 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

విద్యుత్‌స్తంభాలు వేసి వైర్లు బిగిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-గొలుగొండ : గొలుగొండ మండలం చోద్యంలో వ్యవసాయ మోటార్లకు ఇచ్చిన విద్యుత్ లైన్‌లోని స్తంభాలను, వైర్లను విద్యుత్‌శాఖ సిబ్బంది సరిచేశారు. గురువారం ప్రజాశక్తి దినపత్రికలో 'కర్ర స్తంభాలపై విద్యుత్ వైర్లు' శీర్షికతో వెలువడిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఆగమేఘాలపై విద్యుత్ సిబ్బంది అక్కడికి చేరుకొని ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ వైర్లను, స్తంభాలను సరి చేశారు. ఇప్పటి వరకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు, వాలిపోయిన స్తంభాలతో భయభ్రాంతులకు గురైన సాగు రైతులు, వాటిని సరిచేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గురుకుల ప్రవేశాల దరఖాస్తు గడువు పెంపు

ప్రజాశక్తి-గొలుగొండ : స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈనెల 13 వరకు పెంచినట్లు ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు తెలిపారు. పాఠశాలలో ప్రవేశ దరఖాస్తుకు ఈనెల 6వతేదీ ఆఖరుగా ముందుగా ప్రకటించగా, దాన్ని గురుకుల పాఠశాలల కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ గడువు పొడిగించారన్నారు. ద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగన్ చౌకబారు ఆరోపణలు మానుకోవాలి

ప్రజాశక్తి-గొలుగొండ :, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌ను విమర్శించే అర్హత, స్థాయి మాజీ సీఎమ్.జగన్‌కు లేవని జనసేనసర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. గురువారం గొలుగొండలో విలేకర్లతో మాట్లాడుతూ, పవన్‌కల్యాణ్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన జగన్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గడిచిన ఎన్నికల్లో ప్రజలు మిమ్మల్ని ఏ స్థాయిలో ఉంచారో తెలుసుకోవాలని హితవు పలికారు. కుటుంబాన్ని, అధికారాన్ని అడ్డం పెట్టుకుని శవరాజకీయాలు, అక్రమాలకు పాల్పడడం పవన్‌కు తెలియదని, అధికారంలోకి రాకముందే తాను సినిమాల్లో సంపాదించిన సొమ్మును కౌలురైతులకు, బాధిత మత్స్యకారులకు, ప్రజలకు పవన్‌కల్యాణ్ ఇచ్చారన్నారు. ఇప్పటికైనా జగన్ చౌకబారు ఆరోపణలు మానుకోకుంటే, వచ్చే ఎన్నికల్లో ఉన్న 11సీట్లను ప్రజలు ఊడగొడతారన్నారు. కార్యక్రమంలో గండెం దొరబాబు, రేగుబల్ల శివ, దుక్కల రమేష్, సలాదుల ప్రసాద్‌బాబు, బోయిన చిరంజీవి ఉన్నారు.

నీటి కుంటల నిర్మాణంతో ప్రయోజనం

ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న పిడి, ఎపిడి

ప్రజాశక్తి - చీడికాడ : మండలంలోని కోనం పంచాయతీ గుంటి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న ఫారం పాండ్స్ పనులను డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్ పూర్ణిమ దేవి, ఎపిడి శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పొలాల్లో నీటికుంటల నిర్మాణంతో నీటి నిల్వ ద్వారా భూగర్భజలాలను పెంపొందించుకోవచ్చని, తద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. వేసవి కాలంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 6 గంటలకు ఉపాధిపనులకు వచ్చి, 11గంటలలోగా పనిముగించుకుని వెళ్లాలని సూచించారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను కలిగిన వారు ఏడాదికి 150 పని దినాలను చేసుకోవాలని సూచించారు. .కార్యక్రమంలో అదనపు ప్రోగ్రాం అధికారి అల్లు గంగు నాయుడు ఫీల్డ్ అసిస్టెంట్ అప్పలనాయుడు పాల్గొన్నారు

ఉపాధి వేతన బకాయి చెల్లించాలి

◆ 12న చలో విజయవాడను విజయవంతం చేయాలి

◆ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న

వేతనాలు చెల్లించాలని ఆకులు పట్టుకుని అర్థిస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి- రావికమతం: ఉపాధి కూలీలకు పది వారాలుగా బకాయి పడ్డ వేతనాలు తక్షణమే చెల్లించాలంటూ ఈనెల 12న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి. వెంకన్న పిలుపునిచ్చారు. గురువారం రావికమతం మండలంలోని గిరిజన గ్రామాలైన కొమెర, కోట్నాబల్లి, చీమలపాడు, గడబపాలెం తదితర గ్రామాలలో పర్యటించి ఉపాధి కూలీలతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేతన బకాయిలు చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ ఒట్టి ఆకులను చేతుల్లో పట్టుకుని నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి కూలీలకు చట్టంలోని నిబంధనల మేరకు వేతనాలు చెల్లింపులో అధికారులు నిర్లక్ష్యం త గదన్నారు. పనిచేసిన వారికి పదివారాలపాటు కూలిడబ్బులు ఇవ్వకపోతే జీవనోపాధి, కుటుంబపోషణ ఎలా సాగుతుందని ప్రశ్నించారు. ఉపాధి పథకంలో సక్రమంగా వేతనాలు ఇవ్వకపోవడం వల్లే స్థానికులు రాజమండ్రి, కడియం, తూర్పుగోదావరి, మురమండ,వీరవరం, అనపర్తి, ద్వారపూడి, కేశవరం, మండపేట, తదితర గ్రామాలకు వలస పోతున్నారన్నారు.

ఉపాధి కూలీలకు పనిముట్లు, పనిప్రదేశంలో సౌకర్యాల కల్పనలో అధికారులు పట్టించుకోవడ లేదన్నారు. గతంలో మాదిరిగా వేసవి ఉపాధి అలవెన్స్ ఇవ్వాలని, పనిచోట టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. మట్టిపనులకు సంబంధించి క్యూబిక్ మీటర్ పనిరేటును పెంచాలన్నారు. ఉపాధి లక్ష్యాలు సాధన, కూలిడబ్బుల చెల్లింపులకు క్షేత్రస్థాయి సిబ్బందిని బాధ్యులను చేయడం సరికాదన్నారు. జిల్లాలో ఉపాధి బకాయి కోట్లలో ఉందని, అవి ఎపుడు చెల్లిస్తారో చెప్పాలన్నారు. నిబంధనల మేరకు పనిచేసిన రెండువారాల్లో పేమెంట్ చేయాలని, కూలీలకు రోజుకు రూ.300 తక్కువ కాకుండా కూలీ గిట్టుబాటయ్యేలా చర్యలు చేపట్టాలని, ఉపాధి క్షేత్రస్థాయి సిబ్బందిపై అధికారులు, రాజకీయ నేతల వేధింపులు మానుకోవాలని, ఫీల్డ్‌అసిస్టెంట్లకు నెలకు రూ.25వేలు, జీతం ఇవ్వాలని, వారు మరణిస్తే కుటుంబానికి భరోసాగా రూ.25లక్షల పరిహారం చెల్లించాలని వెంకన్న డిమాండ్ చేశారు

కారిడార్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

ఎపిఐఐసి చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి : వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితుల సమస్యలను పరిష్కారం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎం సత్యనారాయణ కోరారు. గురువారం నిర్వాసితులతో కలిసి ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజుకు వినతిపత్రాన్ని అందజేసారు. మండలంలోని వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో సేకరించిన భూములు, మౌలిక వసతుల కోసం చేపడుతున్న పనుల పరిశీలనకు వచ్చిన ఛైర్మన్ మంతెన రామరాజును మూలపర్ర గ్రామం వద్ద స్థానిక నిర్వాసితులతో అప్పలరాజు కలిసి నిర్వాసితుల సమస్యలను దృష్టికి తీసుకువెళ్లారు.

కారిడార్ నిర్వాసితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం 18 ఏళ్ల నిండిన వారికి రూ.25 లక్షల ప్యాకేజీ ఇవ్వాలని, సాగు భూములకు నష్టపరహారం వెంటనే చెల్లించాలని, డి ఫారం,సాగు భూములలో తోటలకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు నిర్వాసితుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఎటువంటి పనులు చేపట్టకూడదని, అయినా ఇక్కడ అధికారులు చట్టాన్ని, కోర్టు తీర్పు లను ధిక్కరించి పనులు చేస్తూ నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నారన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కారం చేసే వరకు పనులు నిలుపుదల చేయాలని, బల్క్ డ్రగ్స్ పరిశ్రమలు ఏర్పాటు చేయవద్దని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.

గిట్టుబాటు ధర కోసం ప్రతిపాదనలు

గిరిజనులతో మాట్లాడుతున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ స్వప్న

ప్రజాశక్తి- మాడుగుల : జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కల్పనకు రైతుల అభిప్రాయం మేరకు అవసరమైన ప్రతిపాదనలు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈనెల 4న ప్రజాశక్తి దినపత్రికలో 'జీడిపిక్కలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి' శీర్షికతో వచ్చిన కథనానికి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వాకా భాను పుష్పలీలావతి స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు అగ్రికల్చర్ అసిస్టెంట్ స్వప్న గురువారం అవురువాడ పంచాయతీ కొండమీది గ్రామంలో జీడిమామిడి రైతులను కలిసి జీడిపిక్కలు కొనుగోలులో అక్రమాలపై అడిగి తెలుసుకున్నారు.కొండవీధి గ్రామంలో 60-80 ఎకరాల్లో జీడితోటలు విస్తరించి ఉండగా, జీడిపిక్కల సేకరణ సీజన్ వచ్చేసరికి సరైన మార్కెటింగ్ సదుపాయం అందుబాటులో లేకపోవడంతో వ్యాపారులు, దళారులకు కిలో రూ.వందకు అమ్ముకోవాల్సి వస్తోందని, తద్వారా తాము నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బయట మార్కెట్‌లోజీడి పిక్కలకు మంచి ధర ఉన్నప్పటికీ, తాము నష్టపోతున్నామన్నారు. ఉద్యానశాఖ, రైతు ఉత్పత్తి దారుల సంఘాలతో మార్కెటింగ్ శాఖ అనుసంధానమై ఎఫ్‌పిఒల ద్వారా గిట్టుబాటు ధర కల్పించి జీడిపిక్కలను కొనుగోలు చేయాలని రైతులు కోరారు. దీనిపై అగ్రికల్చర్ అసిస్టెంట్ స్పందిస్తూ, రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు.

బొటానికల్ టూర్‌కు డిగ్రీ విద్యార్థులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 52 మంది విద్యార్థులు ప్రత్యేక బస్సులో గురువారం బొటానికల్ టూర్‌కు పయనమయ్యారు. విశాఖ ఆంధ్ర యూనివర్సిటీతో పాటు హనుమంతువాకలోని బొటానికల్ రీసెర్చ్ సెంటర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఫిజిక్స్ లెక్చరర్ బి.త్రినాథ్, బోటనీ లెక్చరర్ సిహెచ్.అఖిల్ రాజా, జువాలజీ లెక్చరర్ వి.ప్రశాంతి, కొండలరావు పాల్గొన్నారు.

బొటానికల్ టూర్‌లో పాల్గొన్న డిగ్రీ విద్యార్థులు

టెక్ మెట్ ఇనిస్టిట్యూట్ ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లిలో టెక్‌మెట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్‌ను గురువారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతకాయల విజయ్ మాట్లాడుతూ నర్సీపట్నంలో ఇటువంటి ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇనిస్టిట్యూట్ ఎండి మళ్ల నాగేశ్వరరావు, కౌన్సిలర్ రాజులనాయుడు, మాజీ కౌన్సిలర్ రెడ్డి అప్పలనాయుడు, దాసు, దశరథ్ పాల్గొన్నారు.

'పాడుతా తీయగా' ధీరజ్‌కు అభినందన

ధీరజ్‌ను సత్కరిస్తున్న నారాయణరావు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ఈటీవీ పాడుతా తీయగా మహాసంగ్రామంలో మూడో బహుమతి పొందిన నర్సీపట్నానికి చెందిన దొంతంశెట్టి ధీరజ్‌ను వాసవీ క్లబ్ రీజనల్ చైర్మన్ వెలగా నారాయణరావు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడు తూ ధీరజ్ పాటల్లోనే కాదు, చిత్రకళలో, ఫొటోగ్రఫీలో, రచనల్లోనే కాకుండా అనేక భాషల యందు ప్రావీణ్యం ఉందన్నారు. కార్యక్రమంలో నారాయణరావు కుటుంబ సభ్యులతో పాటు ధీరజ్ కుటుంబీకులు, కంకటాల శిల్ప, వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ పద్మనాభుని రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ గ్రామంగా లోవ కొత్తపల్లి

ప్రజాశక్తి- మాడుగుల : నూరు శాతం ప్రకృతి వ్యవసాయ గ్రామంగా జాలంపల్లి పంచాయతీ లోవ కొత్తపల్లి గ్రామాన్ని ఎంపిక చేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఎం.వాసుదేవరావు తెలిపారు. గురువారం వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి రైతుల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్‌లో లోవ కొత్తపల్లి గ్రామం రైతులందరూ అన్ని రకాల పంటలను సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ ఎటువంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా సహజసిద్ధంగా లభ్యమయ్యే వనరులతో తయారు చేసిన కషాయాలను, గోమూత్రము, పేడతో తయారు చేసిన ఎరువులను ఉపయోగించాలని పండించాలన్నారు.

ఈ విధమైన పద్ధతులను పాటించుట వలన రైతులకు పంట పెట్టుబడులు తగ్గుతాయని, నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చునని, అలాగే భూసారాన్ని కాపాడు తూ పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించ వచ్చునని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల ట్రైనర్ దేవి, సిబ్బంది రైతులు పాల్గొన్నారు